ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
ఆదివారం 3 మార్చి 2024



రక్తం కాదు.. నీరు పారిస్తాం..



గెలుపుపై ఫోకస్ పెట్టాలి

పల్నాడులో టీడీపీ అభ్యర్థుల గెలుపుపై చంద్రబాబు ప్రత్యేకంగా దృష్టి సారించారు. రా కదలిరా.. సభ అనంతరం శనివారం రాత్రి ఆయన దాచేపల్లిలో బస చేశారు. ఈ క్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, గురజాల ఇన్‌చార్జి యరపతినేని శ్రీనివాసరావు, నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలను పిలిపించుకుని గెలుపునకు సంబంధించి వారికి పలు సూచనలు చేశారు. నియోజకవర్గాల్లో విజయానికి సంబంధించి జీవీ, యరపతినేనిలను సమన్వయం చేసుకోవాలని లావుకు సూచించినట్లు సమాచారం.


చంద్రబాబుకు వెంకటేశ్వరుడి చిత్రం పటం అందజేస్తున్న యరపతినేని శ్రీనివాసరావు, తనయుడు నిఖిల్


సభకు హాజరైన జనసందోహం

ఫ్యాక్షన్ కాదు.. అభివృద్ధి చేస్తాం



పల్నాటి పౌరుషంతో అభివృద్ధిని చేసి చూపుతామే తప్ప ఫ్యాక్షన్ రాజకీయాలకు పాల్పడబోము. పగ, ప్రతీకారాలతో ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టడం తప్ప వైసీపీ నేతలకు అభివృద్ధి తెలియదు. ఐదేళ్లు అవుతున్నా ఇంకా కొన్ని గ్రామాల్లోకి టీడీపీ శ్రేణులు రాలేకపోతున్నారంటే వైసీపీ నేతలు ఎంత భయపెట్టారో అర్థమవుతుంది. కార్యకర్తలకు అవమానం జరిగిన చోటే వారు కాలర్ ఎగరేసేలా చేస్తా. రేపటి ఎన్నికలలో చంద్రబాబు పాలన వస్తేనే ప్రతిఒక్కరూ సంతోషంగా ఉంటారు. టీడీపీ హయాంలోనే పల్నాడు అభివృద్ధి జరిగింది.


- యరపతినేని శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే

పల్నాటి పౌరుషం చూపాలి



రానున్న ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ టీడీపీ అభ్యర్థులను గెలిపించి పల్నాటి పౌరుషాన్ని చాటాలి. వైసీపీ అరాచక పాలనకు ముగింపు పలకాలి. మంచినీళ్లు అడిగిన ఎస్టీ మహిళను ట్రాక్టర్‌తో తొక్కి చంపించారు. తోట చంద్రయ్యను చంపించిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి రానున్న రోజుల్లో రూపాయికి రూపాయిన్నర వడ్డీతో చెల్లిస్తాం. వరికిపూడిశల ప్రాజెక్టుతో పీ ఆర్కే నాటకాలు ఆడుతున్నారు. ఈ ప్రాజెక్టు మంజూరులో కీలక పాత్ర ఎంపీ శ్రీకృష్ణదేవరాయలుదే. ఈ విషయంలో ఆయన్ను అభినందించాలి. **- జీవీ ఆంజనేయులు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు**

రాష్ట్రంలో రాక్షస పాలన



రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతుంది. వైసీపీ పాలనను అంతమొందించేందుకు టీడీపీ నేతలు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు. టీడీపీ వారిపై అక్రమ కేసులు పెట్టి అన్యాయంగా జైలు పాలు చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి అవసరం. **- ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ మంత్రి**

ఎంపీగా పల్నాడు అభివృద్ధికి కృషి



ఎంపిగా ఉన్నంతకాలం పల్నాడు అభివృద్ధికి కృషి చేశాను. వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి పర్యావరణ, అటవీశాఖల అనుమతులను తీసుకొచ్చా. కేంద్ర ప్రభుత్వ నిధులతో బ్రాహ్మణపల్లిలో మెడికల్ కళాశాల, నకరికల్లు వద్ద ఇజ్రాయేలు సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన ప్రాజెక్టు, రూ.500 కోట్లతో జలజీవన్ పథకం, మాచర్లలో కేంద్ర విద్యాలయం సాధించాను. కేంద్రం నిధులతో 400 కిలోమీటర్ల దూరం పొలంబాటలు వేయించాను. అమరావతి రాజధానిని ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. **- లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీ**

రాష్ట్రంలో సైకో పాలన



రాష్ట్రంలో సైకో పాలన సాగుతుంది. పల్నాడులో వ్యక్తుల ప్రాథమిక హక్కులకు కూడా భంగం కలుగుతుంది. తండ్రి పేరు చెప్పుకుని ఒక్క చాన్స్ పేరుతో జగన్ అధికారం చేపట్టి అరాచకం చేస్తున్నారు. 100 ఇచ్చి వెయ్యి రూపాయలు లాగేస్తున్న జగన్‌ను ఈసారి ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. షర్మిల, సునీత ప్రశ్నలకు జగన్ ముందు సమాధానం చెప్పాలి. దేవుడిని కూడా వదలకుండా టెంకాయల రూపంలో దోపిడీ చేస్తున్నారు.

- జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మాచర్ల అభ్యర్థి



దొంగల ముఠా లీడర్ జగన్



జగన్ ఒక నియంత. బ్రిటీష్ వారిని తలపించేలా పాలన చేస్తున్నాడు. బెయిల్‌పై బయటకు వచ్చి అధికారం చెలాయిస్తున్నాడు. దేశంలోనే అధిక సంపన్నుడు కావాలనే ఆశతో అవినీతి సామ్రాజ్యాన్ని నెలకొల్పాడు. దొంగల ముఠాకు లీడర్ జగన్. కులాలు, మతాలు, పార్టీలను కూడా వదిలిపెట్టడం లేదు. అన్ని వర్గాల ప్రజలను ఇబ్బంది పెట్టేందుకే జగన్ పూనుకున్నాడు.

- కన్నా లక్ష్మీనా రాయణ, మాజీ మంత్రి

వైసీపీతో పదేళ్లు వెనక్కి



వైసీపీ పాలనతో రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్లింది. పల్నాడులో వైసీపీ నేతలు ఏడాదికి మూడు వేల కోట్ల అవినీతి సంపాదన మరిగారు. పెదకూరపాడులో నెలకు 30 నుంచి 40 కోట్ల ఇసుక దందా జరుగుతుంది. వరికిపూడిశెల పూర్తి చేసి 2024లో ఓట్లు అడుగుతానన్న పిన్నెల్లి ఇప్పుడేమి సమాధానం చెబుతాడు.

- గాదె వెంకటేశ్వరరావు, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు





మహిళల నినాదాలు

- వైసీపీ నరహంతకులను వదలిపెట్టం
- సాగు, తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం
- కష్టపడండి.. భవిష్యత్‌కు బంగారు బాట వేస్తా
- దాచేపల్లి రా.. కదలిరా బహిరంగ సభలో చంద్రబాబు

పిడుగురాళ్ల, దాచేపల్లి(నరసరావుపేట), గుంటూరు సిటీ, గుంటూరు(ఆంధ్రజ్యోతి), మార్చి 2: పల్నాడులో వైసీపీ రక్తం పారించింది.. దానిని ఆపేసి.. నీటిని పారిస్తాం.. పల్నాడుకు నీరందిస్తాం.. అని టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పారు. శనివారం దాచేపల్లిలో రా.. కదలిరా సభలో ఆయన ప్రసంగించారు. జగన్ పాలనలో పల్నాడులోని ఒక్క సాగు, తాగు నీటి ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదన్నారు. వరిక పూడిశెల అనుమతులు తీసుకువచ్చిన లావు శ్రీకృష్ణ దేవరాయలు పర్యవేక్షణలోనే ప్రాజెక్టుకు నిధులు విడుదల చేసి ఏడాదిలో పూర్తి చేస్తానని హామి ఇచ్చారు. బుగ్గవాగు నుంచి పిడుగురాళ్ల, దాచేపల్లి పట్టణాలకు తాగునీరు అందిస్తామన్నారు. తంగెడ, కొత్తపల్లి ఎత్తిపోతల పథకాలను పూర్తి చేస్తామన్నారు. వాటర్ గ్రిడ్‌ను పూర్తి చేసి ఇంటింటికి నీరు ఇస్తామన్నారు. గోదావరి నీటిని సాగర్ కుడికాలువకు తరలించే ఎత్తి పోతల పథకాన్ని పూర్తి చేసి కరువు నివారిస్తామని తెలిపారు. పల్నాడు జిల్లాలో టీడీపీకి చెందిన 30 మందిని వైసీపీ ప్రభుత్వం హతమార్చిందని, ఒక్కరిని కూడా వదిలిపెట్టకుండా నరహంతకులను అణగతొక్కుతామన్నారు. కులం, మతం పక్కన పెట్టి, పల్నాడు పరిరక్షణకు కదలి రావాలని పిలుపిచ్చారు. పల్నాడు పౌరుషాన్ని, బ్రహ్మనాయుడుని స్ఫూర్తిగా తీసుకుని రానున్న 40 రోజులు కృషి చేసి టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలన్నారు. అహంకారంతో ఇష్టాను సారం రాష్ట్రాన్ని నాశనం చేసిన జగన్‌ను ఇంటికి పంపించాల్సిన సమయం వచ్చిందని తెలిపారు.



చంద్రబాబును సత్కరిస్తున్న జనసేన నేతలు గాదె, బోనబోయిన

ఉప్పొంగిన జనసంద్రం

రా.. కదలిరా సభలో ఉప్పొంగిన జనసంద్రాన్ని చూసి చంద్రబాబు ఖుషీ అయ్యారు. యరపతినేని ఆధ్వర్యంలో జరిగిన సభ విజయవంతమైంది. సుమారు లక్ష మంది వరకు తరలివచ్చినట్లు తెలుస్తోంది. మునుపెన్నడూ లేని విధంగా మహిళలు, యువకులు, రైతులు స్వచ్ఛందగా సభకు తరలి వచ్చారు. నేతలు అనుకున్న దాని కంటే ఎక్కువ మంది సభకు హాజరయ్యారు. సభలో నేతలు, ముఖ్యంగా చంద్రబాబు ప్రసంగాలకు యువకులు, మహిళలు చాలా సందర్భాల్లో కేరింతలు కొట్టారు. జగన్‌ని చంద్రబాబు విమర్శించినప్పుడల్లా సభికులు ఈలలు వేశారు. మాచర్ల నియోజక వర్గంలో జరుగుతున్న అవినీతి, అరాచకం గురించి మాట్లాడినప్పుడు అనూహ్యమైన స్పందన వచ్చింది. గురజాల యరపతినేని శ్రీనివాసరావు గురించి ప్రస్తావన రాగానే పెద్ద పెట్టున నినాదాలు చేశారు. నాది.. పవన్‌ది ఒకటే దారి.. మా ఇద్దరి ఆలోచన ఒకటే అంటూ పవన్ గురించి చంద్రబాబు అన్నప్పుడు జనసేన కార్య కర్తలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. సభకు అతి తక్కువ సమయం ఉన్నప్పటికీ ఏర్పాట్లు చేయడంలో యరపతినేని వెనకడుగు వేయలేదు.

యరపతినేనిని మరిచిపోను

పల్నాడు జిల్లా వైసీపీ అరాచకాలను ఎదుర్కొంటూ ధీటుగా పోరాడుతున్న గురజాల ఇన్‌చార్జ్ యరపతినేని శ్రీనివాసరావుని తాను ఎప్పుడూ మరిచిపోనని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్ర బాబునాయుడు స్పష్టం చేశారు. శనివారం రాత్రి దాచేపల్లిలో రా... కదలి రా సభలో చంద్రబాబు ఈ ప్రకటన చేయగానే సభా ప్రాంగణమంతా హర్షధ్వానాలతో మారుమోగింది. యరపతినేని జై అంటూ నినాదాలతో హోరెత్తించారు. మై ఎమ్మెల్యే ఈజ్ యర పతినేని అంటూ పోస్టర్లు ప్రదర్శించి ఉత్సాహం చాటారు. చం ద్రబాబు మాట్లాడుతూ యరపతినేని ఇక్కడే ఉండి పోరాడుతు న్నారు. 13 మందిని చంపారని ఆయన పడిన ఆవేదన వర్ణనాతీతం. ఆ బాధ అంతా నా కళ్ల ముందు కదులాడుతున్నది. టీడీపీ నాయకులు, కార్యకర్తలను కాపాడుకొనేందుకు యరపతినేని త్యాగాలు చేస్తున్నారు. అలాంటి యరపతినేనిని తాను మరిచి పోనన్నారు. అలానే జూలకంటి బ్రహ్మారెడ్డి కూడా వీరోచితంగా పోరాడుతున్నారు. మాచర్లలో ఈ దఫా ఆయన గెలుపు తథ్యమ న్నారు. అలానే జీవీ ఆంజనేయులు పల్నాడులో సమర్థవంతంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు నూటికి నూరు శాతం టీడీపీ జనసేన గాలి వీస్తున్నది. రాబోయే రోజుల్లో ఇది తుపానుగా మారుతుంది. ఎవరైనా వస్తే కొట్టుకుపోతారని హెచ్చరించారు.


వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు



అరాచక రాజ్యం పోవాలి

పల్నాడులో అరాచక రాజ్యం పోవాలి. ప్రజా రాజ్యం రావాలి. మాచర్లలో మారీ చుడు చేయని దోపిడీ.. కబ్జా ఉందా? గ్రానైట్ లారీలకు కప్పం కట్టాల్సిందే. మాచర్ల వీడి అబ్బ సొత్తా.. ఎస్సీ ఎమ్మెల్యేలను మారుస్తున్న జగన్‌కు మాచర్ల ఎమ్మెల్యేను మార్చే దమ్ముందా. ఎమ్మెల్యే తమ్ముడి దందాలు, అక్రమాలు, మద్యం, రేష న్ మాఫియాకు అడ్డేలేదు. ఇంత జరుగుతుంటే జగన్ ఏం పీకుతున్నాడు. ఎమ్మెల్యే 140 ఎకరాలు పోరంబోకు భూమిని, చివరకు దేవాలయం భూమిని కూడా కబ్జా చేశాడు. అక్రమార్జనతో హైదరాబాద్‌లో ప్యాలెస్ కడుతున్నాడు. మాచర్లకు బ్రహ్మారెడ్డి వచ్చారు.. పులి లాగా తిరుగుతు న్నాడు. పులిని చూసి మేకలు పారిపోతున్నాయని చంద్రబాబు తెలిపారు.

గురజాలలో కాసుల మహేష్‌రెడ్డి పేరు సార్థకం చేసుకున్నాడు. సున్నపురాయి, ముగ్గురాళ్ల వ్యాపా రులు, గ్రానైట్ లారీలు కప్పం కట్టాల్సిందే. దోచిన సంపాదనతో నరసరావుపేటలో షాపింగ్ కాంప్లెక్స్ కడుతున్నాడు.

వినుకొండలో బొల్లా లెక్క తేలుస్తాం. వినుకొండను పిండుతున్న అనకొండ ఆయన. ముస్లిం, వైశ్యుల భూములను కబ్జా చేశాడు. బినామీ పేర్లతో పొలాలు కొని అధిక ధరకు ప్రభుత్వానికి ఇచ్చి రూ.100 కోట్లు దోచుకున్నాడు. గిట్టుబాటు ధర కావాలని అడిగిన రైతును చెప్పుతో కొడతానని బెదిరించాడు.

చిలకలూరిపేటలో రజని సైబారాబాద్ మొక్క ఈమే సీటును చింపేశారు. గుంటూరు నుంచి పోటీచేయబోతున్న రజని అక్కడ కూడా ప్యాకప్పే. ఈమె మళ్లీ సైబరాబాద్‌కే పోతుంది.

అంబోతు అంబటి సత్తెనపల్లిలో రంకెలు వేస్తాడు. ఇరిగేషన్ మంత్రిగా ఒక్క పిల్ల కాల్వ కూడా తవ్వించ చలేదు. నన్ను, పవన్ కల్యాణ్‌ను విమర్శించడమే ఆయన పని. శాశ్వితంగా రంకే వేయకుండా చేస్తాం.

పెదకూరపాడులో శాండ్ శంకర్రావు ఇసుక మాఫియా నడుపుతున్నాడు. కొట్టేసిన సొమ్ములో జగన్‌కు వాటా ఇస్తున్నాడు. 400 ఎకరాల అటవీ భూమిని ఆక్రమించాడు.

నరసరావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి అరాచకవాది. ప్రతి పనికి పర్సంటేజ్ ఇవ్వాలి. అయనకు కప్పం కట్టందే ఏ పని కాదు.



చంద్రబాబుతోనే భవిష్యత్

రాష్ట్ర భవిష్యత్ కోసం చంద్రబాబు అవసరం ఎంతో ఉంది. చంద్రబాబు సీఎం అయితే తప్ప రాష్ట్రానికి వెలుగు రాదు. పోలవరం, వరికపూడిశెల ప్రాజెక్టులు పూర్తి చంద్రబాబుతోనే సాధ్యం. వరికపూడిశెల ప్రాజెక్టు సాధనకు కృషి చేసిన లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు టీడీపీ అభ్యర్థులందరినీ గెలిపించుకోవాలి. వైసీపీ నేతలు భాష మార్చుకోకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు.



- మక్కెన మల్లికార్జునరావు, మాజీ ఎమ్మెల్యే

వైసీపీ ఓటమి ఖాయం

రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ ఓటమి ఖాయం. ఎంపీగా శ్రీకృష్ణదేవరాయలు, అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి. టీడీపీని గెలిపించి వైసీపీని సాగనంపేందుకు టీడీపీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారు.



- కొమ్మాలపాటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే

రాష్ట్రంలో కులాల కుంపటి

కులాల కుంపటితో రాష్ట్రంలో జగన్ పాలన సాగిస్తున్నాడు. పల్నాడులోనూ కుల రాజకీయం చేస్తున్నాడు. టీడీపీ జనసేన ఉమ్మడి ప్రభుత్వం రావాలని ప్రజలందరూ కోరుకుంటున్నారు.



- బోనబోయిన శ్రీనివాసయాదవ్, జనసేన నేత



రాష్ట్రంలో దుష్టపాలన

ఓటమికి జగన్ సిద్ధమవ్వాలి. వైసీపీని ఇంటికి పంపేందుకు టీడీపీ సంసిద్ధంగా ఉంది. రాష్ట్రంలో వైసీపీ పాలన దుష్ట పాలనను తలపిస్తోంది.

- డాక్టర్ చదలవాడ అరవిందబాబు, నరసరావుపేట ఇన్‌చార్జి







తుళ్లూరు రైతు ధర్నా శిబిరం వద్ద దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవం

● 1537వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మార్చి2: సీఎం జగన్‌రెడ్డి దెబ్బకి రాష్ట్రం 20 సంవత్సరాలు వెనకడిపోయిందని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శనివారం నాటికి 1537వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ మూడు రాజధానుల అవసరం లేకపోయినా సొంత ప్రయోజనాల కోసం బలవంతంగా రుద్దాలని పాలకులు చూస్తున్నారన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవం అమరావతి అని అన్నారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని అని స్పష్టం చేశారు. మూడు ముక్కలాట సీఎం జగన్‌రెడ్డి ఇక ముగించాలని డిమాండ్ చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. సాయంత్రం వేళ దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాలలో బిల్డ్ అమరావతి అంటూ రైతులు నినాదాలు చేశారు.

దాచేపల్లి.. దద్దరిల్లే

● జనసంద్రం.. జయకేతనం
● చంద్రబాబు సభ సూపర్ హిట్
● సభకు జనం పోటెత్తారు
● కిక్కిరిసిన సభా ప్రాంగణం
● అధినేత చంద్రబాబు ప్రసంగానికి విశేష స్పందన



ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు, అభిమానుల కేరింతలు

పిడుగురాళ్ల, దాచేపల్లి (నరసరావుపేట), మార్చి 2: గురజాల నియోజకవర్గం దాచేపల్లిలో శనివారం జరిగిన రా.. కదలిరా బహిరంగ సభ సూపర్ హిట్ అయింది. అధికార వైసీపీ నేతల బెదిరింపులు.. మందు టెండను లెక్కచేయక జనం దాచేపల్లి వైపు అడుగులు వేశారు. తెలుగు తమ్ముళ్లు, జనసైనికులు కలికట్టుగా కదం తొక్కారు. దాచేపల్లిలో శనివారం నిర్వహించిన రా.. కదలిరా సభ జనసంద్రంగా మారింది. సభా ప్రాంగణం కిటకిటలాడింది. ప్రభుత్వం బస్సులు కేటాయించకపోయినా, పోలీసులు సరైన భద్రత కల్పించకు న్నా.. ప్రైవేట్ వహనాలపై ఆంక్షలు విధించినా టీడీపీ, జనసేన అభిమానులు ప్రత్యామ్నాయ మార్గాల్లో సభా ప్రాంగణానికి భారీగా చేరుకున్నారు. జిల్లా నలుమూల నుంచే కాకుండా ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి పెద్దఎత్తున తరలివచ్చారు. సభా ప్రాంగణంలోని అన్ని గ్యాలరీలు నిండిపోయాయి. ప్రాంగణంలో బారికేడ్లను తొలగించుకొని వేదిక వద్దకు వచ్చి కేరింతలు కొట్టారు. అధినేత చంద్రబాబు అభివాదం చేస్తున్న తరుణంలో పార్టీ శ్రేణులు, అభిమానులు జై చంద్రబాబు.. సీఎం నినాదాలతో ప్రాంగణం హోరెత్తింది.

చంద్రబాబు ప్రసంగం మొదలుపెట్టినప్పటి నుంచి కార్యకర్తలు, జనం నినాదాలు హోరెత్తించారు. చంద్రబాబు జగన్‌పై విమర్శలు చేస్తున్నపుడు హర్షాతిరే కాలు వ్యక్తం చేశారు. సైకో పోవాలి అంటూ చంద్రబాబు నినా దం చేస్తుంటే భారీ స్పందన వచ్చింది. మీ భవిష్యత్ కోసం టీడీపీ-జనసేన ప్రభు త్వం రావాలి. అందుకోస మే కూటమిగా ఏర్పడిందని చంద్రబాబు చెప్పారు. వైసీపీ అరాచకపాలనపై ధ్వజమెత్తారు. జిల్లాలో వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల అవి నీతిని తూర్పారపట్టారు. టీడీపీ, జనసేన అధికారంలోకి రాగానే జిల్లాలో చేపట్టనున్న అభివృద్ధి ప నులను వివరించారు. చంద్రబాబు ప్రసంగం అద్యంతం అభిమానులను ఉర్రూతలూగించింది. చంద్రబాబు జగన్‌పై సంధించిన విమర్శనాస్త్రాలకు.. కేకలతో ప్రాంగణం మార్మోగింది. టీడీపీ, జనసేన పొత్తు బంపర్‌హిట్ అనడంతో సభలో అభిమానులు కేరింతలు కొట్టారు. మాజీ ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడేటప్పుడు ప్రజలనుంచి మంచి స్పందన వచ్చింది.

సత్తా చాటిన యరపతినేని...

సభ విజయంతం చేయడం ద్వారా గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సత్తాచాటారు. అధినేత మన్ననలను ఆయన అందుకున్నారు. జిల్లా నుంచి ఎంతమంది అభిమానులు తరలివచ్చారో.. ఒక గురజాల నియోజకవర్గం నుంచే అంతమంది తరలివచ్చారు. ఇంతటి భారీ బహిరంగ సభ ఏర్పాట్లను యరపతినేని కేవలం 48 గంటల్లోనే పూర్తిచేయడం విశేషం. భారాన్ని మొత్తం తన భుజస్కందాలపై వేసుకొని ఏర్పాట్లు చేయించారు. నియోజకవర్గంలోని ఊరూవాడ సభకు కదలిరావడం వెనుక యరపతినేని శ్రమ ఎంతో ఉంది. సభకు పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు అధ్యక్షత వహించగా మాజీ మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కన్నా లక్ష్మీనారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, నన్నపనేని రాజకుమారి, ఆలపాటి రాజేంద్రప్ర సాద్, జూలకంటి బ్రహ్మారెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, గొట్టిపాటి రవికుమార్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, కొమ్మాలపాటి శ్రీధర్, భాష్యం ప్రవీణ్, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, నల్లపాటి రామచంద్రప్రసాద్, జనసేన నేతలు గాదె వెంకటేశ్వరరావు, బోనబోయిన శ్రీనివాస యాదవ్, సయ్యద్ జిలాని తదితర నేతలు పాల్గొన్నారు. తెలుగు ఎన్టీఆర్ విగ్రహానికి చంద్రబాబు పూల మాలవేసి నివాళులర్పించారు.

సైకిల్ ఎక్కిన ఎంపీ లావు.. మక్కెన, పలువురు నేతలు

పల్నాడు జిల్లాలో వైసీపీ కీలకనేత ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంతో దాచేపల్లి రా.. కదలిరా సభలో పసుపుకండువా కప్పుకొన్నారు. ఇటీవల ఆయన రాజీనామాచేసిన విషయం తెలిసిందే లావుతో పాటు వినుకొండ మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పలువురు జడ్పీ టీసీలు, వైసీపీ నేతలు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వీరందరికీ చంద్ర బాబు పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా అహ్వానించారు.

పల్నాడు సమస్యలపై లావు ప్రస్తావన

● పనులన్నీ పూర్తి చేస్తామని చంద్రబాబు హామీ

గుంటూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంత సమస్యలను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు రా కదలిరా సభలో చంద్రబాబుకు నివేదించారు. శనివారం దాచేపల్లిలో జరిగిన రా.. కదలిరా సభలో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన ఆయన తాను ఐదేళ్లలో ఎంపీగా పల్నాడు అభివృద్ధికి చేసిన కృషిని వివరించారు. వరికపూడిశెల ప్రాజెక్టుకి నిధులు కేటాయిస్తే ఎనిమిది నెలల్లో లిఫ్టులు పూర్తి చేసి 1.25లక్షల ఎకరాలకు సాగునీరు, 3లక్షల మందికి తాగునీరు ఇవ్వవచ్చన్నారు. అలానే గోదావరి నీటిని తీసుకొచ్చి నకరికల్లు వద్ద సాగర్ కాలువలో కలిపితే 9 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందన్నారు. పల్నాడులో తాగునీటి కష్టాలు తీర్చడానికి వాటర్ గ్రిడ్ అవసరమన్నారు. అలానే నియోజకవర్గానికి ఒక 100 పడకల ఆస్పత్రి కావాలని తెలిపారు. లాజిస్టిక్ హబ్ అభివృద్ధి చేస్తే ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. చంద్రబాబు స్పందిస్తూ వరికపూడిశెల ప్రాజెక్టు ఏడాది వ్యవధిలోనే పూర్తి చేస్తామన్నారు. బొల్లాపల్లి రిజర్వాయర్ నిర్మించి 75 టీఎంసీల నీటిని నిల్వ చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు. రోడ్లు అభివృద్ధి చేస్తామని, పల్నాడులో ఉన్న సహజ వనరులను వినియోగించి పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు.

వైసీపీకి రాజీనామా చేసిన వారిని అభినందిస్తున్నా..

వైసీపీలో సీటు ఇస్తానన్నా వద్దని ఆరుగురు ఎంపీలు, 10మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాజీనామా చేశారని, వారందరిని తాను అభినందిస్తున్నానని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసే వ్యక్తి వద్ద మంచోళ్లకు స్థానం ఉండదన్నారు. జగన్ తానే ఒక పెద్ద సైకో అని, అలానే ఊరూరికి పిల్ల సైకోలను తయారు చేశాడన్నారు.

5న బీసీ డిక్లరేషన్

ఈ నెల 5న బీసీ డిక్లరేషన్‌ని ప్రకటించబోతోన్నట్లు చంద్రబాబు చెప్పారు. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాగానే ఐదేళ్లలో బీసీలకు చేయబోయే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఆ డిక్లరేషన్‌లో ప్రకటిస్తామన్నారు. అలానే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కూడా మేలుచేసే కార్యక్రమాలు చేపడతామని చంద్రబాబు తెలిపారు.

వైసీపీ పాలనలో యువతకు మొండిచేయి

● కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, మార్చి 2: ఒక క్రిమినల్‌ను ముఖ్యమంత్రిగా చేస్తే ఏం జరుగుతుందో వైఎస్ జగన్ చేసి చూపించాడని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో అధికంగా నష్టపోయింది యువతేనన్నారు. ఈ ఐదేళ్లలో వారి కోసం ప్రభుత్వం ఏం చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఒక్కో జిల్లాను ఒక రాజధానిగా అభివృద్ధి చేస్తామని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ యువత జీవితాలను నాశనం చేశారని ఆయన విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 7.5 లక్షల ఉద్యోగాలను కల్పిస్తే నేడు రాష్ట్రాన్ని దేశంలోనే అత్యధిక నిరుద్యోగం గల రాష్ట్రంగా తయారు చేసిన ఘనత జగన్‌దేనన్నారు. రూ.70వేల కోట్లతో అదానీ డేటా సెంటర్‌ను రాష్ట్రానికి చంద్రబాబు తీసుకు వచ్చారన్నారు. వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టారన్నారు. కాని జగన్ మాఫియాకు భయపడి వారు అంతా వెనక్కి వెళ్ళి పోయారన్నారు. లక్షలాదిమంది యువత జీవితాలను నాశనం చేశారన్నారు. రాష్ట్రంలో మూడు రాజధానులు అంటే నిరుద్యోగ రాజధాని, డ్రగ్స్ రాజధాని, క్రైం రాజధానిగా తయారు చేసిన ఘనత జగన్‌దేనన్నారు. టీడీపీ ప్రభుత్వ రూ.16.40 లక్షల మందికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తే వైసీపీ ప్రభుత్వంలో పది లక్షల మందికే ఇచ్చారన్నారు. 6.85 లక్షల మందికి టీడీపీ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ భృతిని ఇస్తే అప్పటి ప్రభుత్వం నిరుద్యోగ భృతి లేకుండా చేసిందన్నారు. నిరుద్యోగ యువత భవిష్యత్‌కు భరోసా తెలుగుదేశంతోనే అన్నారు. టీడీపీ, జనసేన కూటమిని ప్రజలు ఆదరించాలన్నారు. పట్టణంలో జరిగిన ర్యాలీలో తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు ఎలినేడి లక్ష్మీతులసి వినూత్నరీతిలో చేసిన ప్రచారం పట్టణ ప్రజలను, పార్టీ నాయకులను, కార్యకర్తలను ఆకట్టుకుంది.

టీడీపీతోనే ప్రతి ఒక్కరి సంక్షేమం: ధూళిపాళ్ళ



నరేంద్ర కుమార్‌కు మద్దతు తెలుపుతున్న మామిళ్లపల్లి వాసులు

పొన్నూరుటౌన్, మార్చి2: తెలుగుదేశం పార్టీతోనే ప్రతి ఒక్కరి సంక్షేమం సాధ్యమవుతుందన్ని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. మండలంలోని మామిళ్లపల్లి గ్రామానికి చెందిన అంబాల కుటుంబ సభ్యులు శనివారం చింతలపూడిలో నరేంద్ర కుమార్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ ప్రయాణం తెలుగుదేశం పార్టీతోనే కొనసాగిస్తామన్నారు. నరేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల సంక్షేమం కుంటు పడిందన్నారు. జగన్‌రెడ్డి అరాచకాలతో అల్లాడుతున్న రాష్ట్ర ప్రజానీకం వైసీపీని సాగనంపటానికి సిద్ధపడిందన్నారు. ఒక్క నియోజకవర్గంలో పనికిరాని ఎమ్మెల్యే మరో నియోజకవర్గంలో ఎలా పనికివస్తాడన్ని ప్రశ్నించారు. పొన్నూరు నుంచి ఒక్క దొంగ వెళ్తే మరో గజదొంగ వచ్చాడన్ని ఎద్దేవా చేశారు. ప్రజలు కూడా అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ వైసీపీ దొంగల మాయలో పడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అంబాల చిన్న వెంకట రామయ్య, శివరామ కృష్ణ, దుర్గా ప్రసాద్, అంజనయ్య, లంకేశ్వరరావు, భాగ్యరాజు, పిచ్చయ్య, నాగార్జున, నవీన్ కుమార్, రామకోటయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య హక్కు చట్టం అనర్ధదాయకం

● రద్దు చేసే వరకు పోరాడుతాం ● న్యాయవాద సంఘాల తీర్మానం



ప్రసంగిస్తున్న గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీకే సురేష్

గుంటూరు(లీగల్), మార్చి 2: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయతలపెట్టిన యాజమాన్య హక్కు చట్టం వల్ల అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని రాష్ట్ర ప్రభుత్వం ఆ చట్టాన్ని రద్దు చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని న్యాయవాద సంఘాలు తీర్మానించాయి. భూ యాజమాన్య హక్కు చట్టం వల్ల కలిగే దుష్పరిణామాలపై గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీకే సురేష్ అధ్యక్షతన రాష్ట్రంలోని వివిధ బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులతో శనివారం గుంటూరులో విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ బార్ అసోసియేషన్ల నుంచి ప్రతినిధులు హాజరై ఈ చట్టం వలన కలిగే దుష్పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు. యాజమాన్య హక్కు అనేది రాజ్యాంగం ద్వారా కల్పించబడిన హక్కు అని వక్తలు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టం ద్వారా ప్రజల నుంచి ఆ హక్కును లాక్కోవాలని చూడటం దుర్మార్గమైన చర్య అని అభివర్ణించారు. ఈ చట్టం ద్వారా బలవంతులకే ఆస్తి చెందుతుందని, సామాన్యులు ఆస్తులను కోల్పోవాల్సిన దుస్థితి దాపురిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆస్తి వివాదాలను పరిష్కరించేందుకు ప్రస్తుతం పనిచేస్తున్న సివిల్ కోర్టు విచారణ పరిధిని ఈ చట్టం ద్వారా తీసివేయటం శోచనీయమని వక్తలు పేర్కొన్నారు. ఈ చట్టం రద్దు కోసం ప్రజల ద్వారా ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని సమావేశంలో తీర్మానించారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత కొత్త ప్రభుత్వం ఈ చట్టాన్ని రద్దు చేసే వరకు తిరిగి బలమైన ఉద్యమాన్ని నిర్మించాలని నిర్ణయించారు. సమావేశంలో వివిధ బార్ అసోసియేషన్ల నుంచి అధ్యక్ష, కార్యదర్శులుతో పాటు వందల సంఖ్యలో ప్రతినిధులు హాజరయ్యారు.

కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లకు రూ.30 లక్షల మంజూరు

● నేటి నుంచి మూలవిరాట్‌కు అభిషేకాలు నిలుపుదల

నరసరావుపేట, మార్చి 2: కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి తిరునాళ్ల ఏర్పాట్లకు ప్రభుత్వం రూ.30లక్షల నిధులు మంజూరుచేసిందని ఈవో జీ శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదాను ప్రభుత్వం కల్పించిందన్నారు. ఆదివారం నుంచి 9వ తేదీ వరకు శ్రీత్రికోటేశ్వరుని మూలవిరాట్‌కు అభిషేకాలు నిలుపుదల చేస్తున్నట్టు ఈవో తెలిపారు. అభిషేకమండపంలో స్వామికి అభిషేకాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మార్పును భక్తులు గమనించాలని కోరారు. తిరునాళ్ల ఏర్పాట్లకు నిధుల్లేవ్.. శీర్షికతలో ఆంధ్రజ్యోతిలో వార్త వెలువడిని విషయం తెలిసిందే.

ఎమ్మెల్యే కోనకు ధనార్జనే ధ్యేయం

● వైసీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌బాబు ● వైసీపీకి రాజీనామా...



బాపట్ల, మార్చి 2: పార్టీకోసం పనిచేసిన కార్యకర్తలను పక్కన పెట్టి ధనార్జనే ధ్యేయంగా బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పని చేస్తున్నారని వైసీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ముప్పిరి రాజశేఖర్‌బాబు ఆరోపించారు. ఈ విషయమై శనివారం ఆయన మాట్లాడుతూ దళితులను కించపర్చేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. దళితులుగా ప్రశ్నించకుండా నోరునొక్కటం కోనకే చెల్లిందన్నారు. వైసీపీ ముసుగులో ఉంటూ డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను తొలిగించిన ఘనుడు కోన అన్నారు. జగన్ చేతులమీదగా మున్సిపల్ కార్యాలయం వద్ద ఆవిష్కరించిన వైఎస్ విగ్రహాన్ని తొలిగించారని తిరిగి అదే ప్రాంతంలో పెట్టమని అడిగితే తనను వైసీపీ ద్రోహి అనటం హాస్యాస్పదమన్నారు. బాపట్ల ప్రజలు ఇసుక దోపిడి గురించి చేసే ఆరోపణలకు ఎమ్మెల్యే కోన సమాధానం చెప్పాలన్నారు. పార్టీ కార్యక్రమాలకు పిలవకుండా ఆయన కుటిల బుద్ధిని బయట పెడుతున్నారన్నారు. ఆయన అవినీతి, అక్రమాలు గురించి అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం లేకుండాపోయిందన్నారు. ఎమ్మెల్యే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉపాధ్యాయుడి వికృత చేష్టలు

● పోలీసులకు తల్లిదండ్రుల ఫిర్యాదు

పొన్నూరుటౌన్, మార్చి 2: ఓ ఉపాధ్యాయుడు మైనర్ బాలికల పట్ల వికృత చేష్టలకు పాల్పడిన ఘటన శనివారం పొన్నూరు పట్టణంలో చోటు చేసుకుంది. పిల్లలు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వటంతో ఉపాధ్యాయుడి వికృత రూపం బాహ్య ప్రపంచానికి తెలిసింది. పట్టణంలోని 25వ వార్డు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అహ్మద్ అనే ఉపాధ్యాయుడు తమను వేధించాడని చిన్నారులు తల్లిదండ్రులకు చెప్పారు. శనివారం పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులు ఉపాధ్యాయుడిని నిలదీసి ఎంఈవోకు సమాచారం అందించారు. రోజూ పాఠశాల తరగతి గదిలోనే బాలికలపై అసభ్య చర్యలకు పాల్పడుతున్నట్లు అహ్మద్‌పై బాలికలు, వారి తల్లిదండ్రులు ఎంఈవో ఆర్ శోభచంద్‌కు, అర్బన్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే బాలికల తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి అహ్మద్‌ను దాష్టీకాలపై నిలదీసిన సమయంలో అహ్మద్ కుటుంబ సభ్యులు కూడా వచ్చి పాఠశాలలోనే బెదిరింపులకు పాల్పడ్డారు. నెల రోజుల క్రితం అహ్మద్ ఇంటి వద్ద ఓ దివ్యాంగురాలి పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఫిర్యాదు మేరకు అర్బన్ పోలీసులు విచారణ నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపించినట్లు ఎంఈవో ఆర్.శోభచంద్ తెలిపారు.

ముప్పాళ్ళలో ఇరువర్గాల ఘర్షణ

● పలువురికి గాయాలు

ముప్పాళ్ళ మార్చి 2: ముప్పాళ్ళలో ఒక టీపా యింట్ వద్ద జరిగిన గొడ వ చిన్న గొడవ ఇరువర్గా ల మధ్య ఘర్షణగా మారి రెండుపార్టీల మధ్య వివా దంగా మారింది. వివరాల లోకి వెళితే ముప్పాళ్ళ ఏటీఎం వద్ద ఉన్న టీపా యింట్ నిర్వాహకులు శనివారం సాయంత్రం నీల్లుచల్లి శుభ్రం చేసు కుంటుండగా తనపై కా వాలని చల్లారనే విషయంపై ఇరువర్గాల మధ్య వివాదం జరిగింది. అది దాడికి దారి తీయడంతో పలువురికి గాయాలయ్యాయి. ఇరువర్గాలవారు పోలీసుస్టేషన్‌లో ఫిర్యా దు చేసేందుకు వెళ్ళగా స్టేషన్ ముందు కూడా గొడవ జరిగింది. కేవలం అధికార పార్టీ వాళ్ల మాత్రమే స్టేషన్‌లోకి తీసుకెళ్ళారని, గర్భిణిగా ఉన్న తన భార్యకు గాయా లయ్యాయని, తమ ఫిర్యాదు పోలీసులు తీసుకోలేదని, తన మూడేళ్ళ కొడుకు తలకు కూడా గాయమైందని బాషా, అతని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎస్‌ఐ హజరతయ్యను వివరణ కోరగా ఎవరి ఫిర్యాదును తీసుకోలేదని తెలిపారు.

ప్రేమ పేరుతో వంచన?

● ఆపై పెళ్లికి అడ్డుగా ఉన్నావంటూ యువకుడి బెదిరింపు
● మనస్థాపంతో యువతి ఆత్మహత్య
● పోలీస్‌స్టేషన్ ఎదుట బాధిత కుటుంబం ఆందోళన
● పోలీసుల అదుపులో నిందితుడు

పెదకాకాని, మార్చి 2: ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి... కొన్నాళ్ళు సహజీవనం చేసిన తర్వాత 'నేను మరో పెళ్లి చేసుకుంటా, నువ్వు నాకొద్దు' అని మరో యువతితో పెళ్లికి యువకుడు సిద్ధం కాగా, అడ్డు తొలగించుకునేందుకు ప్రేమించిన యువతిని ఆ యువకుడు బెదిరించడంతో ఆమె ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతి ఇంటర్మీడియట్ వరకు చదువుకుంది. అదే గ్రామానికి చెందిన పారుదల పూర్ణచంద్రరావు అనే యువకుడితో ఆమెకి పరిచయం ఏర్పడింది. వీరి పరిచయం ప్రేమగా మారింది. పూర్ణచంద్రరావు ఆమెను పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో కొన్నాళ్ల వారు సహజీవనం కూడా చేశారు. అయితే పూర్ణచంద్రరావు మరో యువతితో పెళ్లికి సిద్ధంకాగా ప్రేమించిన యువతి అతనిని నిలదీసింది. ఈ విషయం పెద్దల మధ్య పంచాయితీ కాగా రాజీ కుదుర్చు కొని ఎవరిదారిన వారు ఉంటున్నారు. దీంతో ఆ యువతి పెదకాకాని మండలంలోని తన బంధువుల వద్ద ఉంటోంది. శుక్రవారం మధ్యాహ్నం పూర్ణచంద్రరావు ఆ యువ తి వద్దకు వచ్చి 'నువ్వు నా పెళ్ళికి అడ్డుగా ఉన్నావు.. నువ్వు చస్తావా.. లేక నన్ను చంపమంటావా?' అంటూ బెదిరించాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆ యువతి శుక్రవారం రాత్రి ఆమె ఉంటున్న ఇంటి వంటగదిలో ఉరిపోసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడు పూర్ణచంద్రరావుపై కేసు నమోదు చేసిన పెదకాకాని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లి, బంధువులు పోలీస్ స్టేషన్ ఎదుట శనివారం ఆందోళన చేపట్టారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.63 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	140, 149,160
చికెన్ విత్ స్కిన్	268.00
చికెన్ స్కిన్ లెస్	278.00

సీనియర్ ఇంటర్‌లో 96.73 శాతం హాజరు నమోదు

● కాపీకొడుతున్న విద్యార్థిపై మాల్‌ప్రాక్టీస్ కేసు

● డీవీవో పి.యర్రయ్య

బాపట్లటౌన్, మార్చి 2 : జిల్లాలో సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. శనివారం జరిగిన ద్వితీయ సంవత్సరం తెలుగు, సంస్కృతం, హిందీపరీక్షకు జిల్లాలో 35 పరీక్షా కేంద్రాలలో 9032 మంది విద్యార్థులకు 8737 మంది హాజరయ్యారు. మరో 295 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. అందులో జనరల్ విభాగంలో 8562 మందికి 8292 మంది హాజరుకాగా ఒకేషనల్ విభాగంలో 470మందికి 445మంది హాజరయ్యారు. మొత్తంగా జిల్లాలో సీనియర్ ఇంటర్‌లో 96.73శాతం హాజరు నమోదైంది. జిల్లాలో చుండూరులో ఏపిఎస్‌డబ్ల్యు జూనియర్ కళాశాలలో పరీక్షలలో కాపీ కొడుతున్న ఇంటర్ విద్యార్థిపై మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు చేసినట్లు జిల్లా ఇంటర్ వృత్తి విద్యాశాఖాధికారి పి.యర్రయ్య తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ నాలుగు పరీక్షా కేంద్రాలను పరిశీలించారని ఆయా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు యర్రయ్య పేర్కొన్నారు.

సెకండ్ ఇంటర్ తెలుగు పరీక్షకు 9 మంది గైర్హాజరు

వేమూరు, మార్చి 2 : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో శనివారం ఇంటర్మీడియల్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. తెలుగు సంస్కృతం ఒకేషన్ కోర్సు వారికి సంబంధించిన జిఎఫ్సీ పరీక్ష రాయవలసిన 304 మంది విద్యార్థులకు 295మంది హాజరయ్యారు. 9మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. తెలుగు ప్రశ్నపత్రంలో ఒక ప్రశ్నలో అక్షర దోషాలు దొర్లినట్లు విద్యార్థులు తెలిపారు.

మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ క్యాంపెయిన్ విస్తృతం



మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

బాపట్ల మార్చి 2 : పట్టణంలో మై ఫస్ట్ ఓటు ఫర్ సీబీఎన్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని విస్తృతం చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకులు వాడవాడలా తిరుగుతూ నూతనంగా ఓటు హక్కు పొందిన వారికి అవగాహన కల్పిస్తూ అర్హత ఉండి ఓటు రానివారిచేత నమోదు చేయించే కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని 3వ వార్డు 47,48 బూత్‌లలో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు కొత్త ఓట్లు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ యలవల వెంకటేశ్వర్లు, యూనిట్ ఇన్‌చార్జి బొడ్డు గోవిందు, పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ, నాయకులు వీరబ్రహ్మం, మద్దిబోయన భావన్నారాయణ, మహిళా నాయకులు చెన్నుపాటి హైమావతి, కూచిపూడి ఝాన్సీరాణి, షేక్ నజ్మా, దగ్గుమల్లి రాణి తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై శిక్షణ తరగతులు

బాపట్ల, మార్చి 2 : రాష్ట్ర డీజీపీ కె.రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ట్రైనింగ్ ఐజి పి.వెంకటరామిరెడ్డి ఉత్తర్వులతో నూతన చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బందికి శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆధ్వర్యంలో బాపట్ల సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందికి గత నెల 26 నుంచి ఈనెల 2వ తేదీ వరకు నిర్వహించిన శిక్షణలో భారతీయ శిక్షాస్మృతి 1860, నేరవిచారణ ప్రక్రియ స్మృతి 1973, భారతీయ సాక్షాధార చట్టం 1872లను భారతప్రభుత్వం ప్రస్తుత సమాజానికి అనుగుణంగా మార్పులు చేసి వాటి స్థానాలలో భారతీయ న్యాయసంహిత(బీఎన్ఎస్), భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అధినియం (బిఎస్ఎ) అను నూతన చట్టాలను భారత ప్రభుత్వం రూపొందించటం జరిగిందని వివరించారు. నూతన చట్టాలు జూలై 1వ తేదీ నుంచి అమలులోకి రానున్న నేపథ్యంలో ఈ చట్టాలపై పోలీసు అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి యుండాలని శిక్షణ ఏర్పాటు చేయటం జరిగినట్లు తెలిపారు. మొదటి దశ శిక్షణలో మొత్తం 6 జిల్లాలు నుంచి 2,900 మంది పోలీసు సిబ్బంది ఆయా స్టేషన్‌లలో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆన్‌లైన్‌లో వర్చువల్ తరగతులలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు రెండో దశ శిక్షణ రేపల్లె, చీరాల సబ్ డివిజన్‌ల పరిధిలోని పోలీసు సిబ్బందికి జరుగుతుందని వివరించారు.

పెగ సిస్టమ్స్ ఒప్పందంతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

● డైరెక్టర్ శారదా సేతుపతి

బాపట్లటౌన్, మార్చి 2 : పెగసిస్టమ్స్ ఒప్పందంతో ఇంజనీరింగ్ విద్యార్థులు బహుళ జాతి సంస్థలలో ఉద్యోగావకాశాలు పొందవచ్చునని పెగ సిస్టమ్స్ డైరెక్టర్ శారదా సేతుపతి అన్నారు. బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం పెగ సిస్టమ్స్‌తో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులలో స్కిల్ డెవలప్‌మెంట్, సాఫ్ట్ స్కిల్స్‌ను పెంపొందించి బహుళజాతి కంపెనీలలో అధిక వేతనాలు పొందేవిధంగా శిక్షణను కల్పిస్తామన్నారు. ఇప్పటి వరకు దేశంలో 20 కళాశాలతో పెగ సిస్టమ్స్ ఒప్పందం కుదుర్చుకుందని, మరో కళాశాల బాపట్ల ఇంజనీరింగ్ యాజమాన్యంతో అవగాహన ఒప్పందం చేసుకోవటం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు దొప్పలపూడి రామ్మోహనరావు, గెల్లి దిలీప్‌కుమార్, జాయింట్ సెక్రటరి కొమ్మినేని హరిపద్మప్రసాద్, ట్రెజరర్ తాళ్ళూరి రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నజీర్, వి.రఘువరన్, గిరిధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నూతన తహసీల్దార్‌గా స్ఫూర్తి

పిట్టలవానిపాలెం, మార్చి 2 : పిట్టలవానిపాలెం మండల నూతన తహసీల్దార్‌గా కె.స్ఫూర్తి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ స్ఫూర్తిని డిప్యూటీ తహసీల్దార్ షేక్ కరీముల్లా, వీఆర్‌వోలు, కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి ఆమెను పూలబొకేతో ఘనంగా సత్కరించారు. స్ఫూర్తి బాపట్ల కలెక్టర్ కార్యాలయం నుంచి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఐ.మునిలక్ష్మి భట్టిప్రోలు తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు.



తహసీల్దార్ స్ఫూర్తిని అభినందిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ కరీముల్లా, సిబ్బంది

ఘనంగా బాపట్ల పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్డీవో రవీందర్

బాపట్ల,మార్చి 2 : బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో బాపట్ల పబ్లిక్ స్కూల్ వార్షిక వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ వి.ఎస్.రఘురాం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్డీవో గంధం రవీందర్, డీఈవో కె.నారాయణరావు, తహసీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ ముఖ్యఅతిధులుగా పాల్గొన్నారు. అన్ని అంశాలలో పాఠశాల అభివృద్ధి సాధిస్తూ మంచి పేరుగడించటం అభినందనీయమన్నారు. ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు మాట్లాడుతూ 1987లో స్థాపించిన పబ్లిక్ స్కూల్ అందరి మన్ననలను పొందటం సంతోషదాయకమన్నారు. ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలను రాబోయే రోజుల్లో మరింతగా అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలుపుతామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు ఆర్డీవో గంధం రవీందర్ బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దొప్పలపూడి రామ్మోహనరావు, గెల్లి దిలీప్, జాయింట్ సెక్రటరి కొమ్మినేని హరిపద్మ ప్రసాద్, కోశాధికారి టి.రామకృష్ణారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునకు కృషి చేయాలి

● నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ



టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వేగేశన నరేంద్రవర్మ

కర్లపాలెం, మార్చి 2 : రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలని బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. బాపట్ల నియోజకవర్గంలో జనసేన, తెలుగుదేశం పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఇంటింటికి తెలుగుదేశం, మీమాటే-నాబాట, భవిష్యత్తుకు గ్యారెంటి కార్యక్రమాలలో భాగంగా ఏట్రవారిపాలెంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులతో కలిసి శనివారం ఇంటింటికి తిరిగి మహిళలకు చీర, నిత్యావసర వస్తువులు తెచ్చుకునే సంచి, తను గురించి తెలియజేసే కరపత్రాలను అందజేసి ఆశీర్వదించమని కోరారు. భవిష్యత్తుకు గ్యారెంటీ సంక్షేమ పథకాలు గురించి వివరించారు. రాబోయే ఎన్నికలలో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నక్కల వెంకటస్వామి, పిట్ల వసంతరెడ్డి, బొద్దుకూరి విజయ, ఏపూరి భూపతిరావు, జనసేన మండలాధ్యక్షులు గొట్టిపాటి శ్రీకృష్ణ, ఉపాధ్యక్షులు చిలకల సురేంద్ర, కట్టా సుజాత, పులుగు సముద్రాలురెడ్డి, జడ్పీటీసీ బాజి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 37 మంది చేరిక

కర్లపాలెం మండలంలోని ఏట్రవారిపాలేనికి చెందిన ఏట్ర రెడంకారెడ్డి ఆధ్వర్యంలో 37 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ చేతులమీదుగా కర్లపాలెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పుకొని శనివారం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై వాహనచోదకులకు అవగాహన

బాపట్ల, మార్చి 2 : హెల్మెట్ వినియోగంపై వాహన చోదకులకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఎస్సై సుధాకర్, హెడ్‌కానిస్టేబుల్ విక్టర్ సిబ్బందితో కలిసి ప్రధాన రహదారులపై ప్రయాణించే ద్విచక్రవాహన దారులకు హెల్మెట్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. రోడ్డు ప్రమాదాల నుంచి రక్షణకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ప్రతి శనివారం ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు నో యాక్సిడెంట్‌డేలో భాగంగా వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్నట్లు వారు తెలిపారు.



హెల్మెట్ గురించి వాహనచోదకులకు వివరిస్తున్న ట్రాఫిక్ ఎస్సై సుధాకర్

రెడ్డిపాలెం సెంటర్‌లో...

పిట్టలవానిపాలెం, మార్చి 2 : జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు శనివారం చందోలు ఎస్సై తన సిబ్బందితో రెడ్డిపాలెం సెంటర్‌లో నో యాక్సిడెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రధాన కూడళ్ళల్లో నో యాక్సిడెంట్ కార్యక్రమాలను తన సిబ్బందితో కలిసి నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు. వాహనచోదకులు తమ వాహనాలను జాగ్రత్తగా నడపాలని ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఎస్సై సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా శ్రీకాంత్



బాధ్యతలు చేపడుతున్న బొజ్జ శ్రీకాంత్

బాపట్ల, మార్చి 2 : బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా బొజ్జ శ్రీకాంత్ శనివారం బాధ్యతలు చేపట్టారు. కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఎన్నికల బదిలీలలో భాగంగా ఆయనను ఇక్కడ నియమించారు. బాధ్యతలు చేపట్టిన ఆయన కార్యాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల చీరాల మున్సిపాలిటి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చిన కె.రామచంద్రారెడ్డి ఒకే పార్లమెంట్‌లో బదిలీ కావటంతో ఆయనను తిరిగి ఆదోని పురపాలక సంఘానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో శ్రీకాంత్ బాధ్యతలు చేపట్టారు.

బ్యానర్ ఆవిష్కరించిన జాయింట్ కలెక్టర్

బాపట్ల, మార్చి 2 : ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ వన్ అనే ఏకీకృత పోర్టల్‌కు సంబంధించిన బ్యానర్‌ను శనివారం జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం ర్యాంప్ అనే స్కీమ్‌ను ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేయగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పోర్టల్‌ను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల అధికారి వై.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీధర్, పరిశ్రమలశాఖాధికారులు

దాడిలో వ్యక్తి మృతి

కర్లపాలెం, మార్చి 2 : ఇరువురు వ్యక్తుల మధ్య వివాదం పెరిగి ఒక వ్యక్తి మరో వ్యక్తిపై దాడి చేయగా తలకు తీవ్రగాయాలై మృతి చెందిన ఘటన కర్లపాలెంలో చోటు చేసుకుంది. ఎస్సై కథనం ప్రకారం కర్లపాలెం పంచాయతీ ఎం.వీరాజుపాలేనికి చెందిన చల్లా పిచ్చయ్య (48) ఇదే పంచాయతీ పాత ఇస్లాంపేటకు చెందిన పఠాన్ కరీముల్లా ఇరువురు పాతసామానులతోపాటు ప్లాస్టిక్ సీసాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. వాటిని అమ్ముకునే విషయంలో ఫిబ్రవరి 29న ఇరువురి మధ్య వివాదం పెరిగి పిచ్చయ్యపై కరీముల్లా కర్రతో దాడి చేయగా తలకు తీవ్రగాయమై శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జనార్ధన్ వివరించారు.

విశ్రాంత సైనికుడు కాండ్రు కిరణ్‌కుమార్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న తాండ్ర సాంబశివరావు

కర్లపాలెం, మార్చి 2 : బాపట్ల మండలం హైదర్‌పేట గ్రామానికి చెందిన విశ్రాంత సైనికుడు తాండ్ర కిరణ్‌కుమార్ శుక్రవారం రాత్రి సత్యవతిపేట దగ్గర జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవటం చాలా బాధాకరమని మాజీ సైనిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు అన్నారు. మరణించిన విశ్రాంత సైనికుని పార్థివ దేహంపై మాజీ సైనికులతో కలిసి తాండ్ర సాంబశివరావు మువ్వన్నెల జెండాను కప్పి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. కాండ్రు కిరణ్‌కుమార్‌కు జోహార్లు అర్పించారు. కిరణ్‌కుమార్ కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టా ఆదిశేషారెడ్డి, మేక కొండలురావు, బొడ్డు రమేష్, డి.వెంకటేశ్వర్లు, రుఖ్మధరరావు, బొలగాని శ్రీనివాసరావు, కర్రి సుబ్బారావు, కె.ఎల్.ఎన్ ప్రసాద్, జిడుగు శ్రీనివాసరావు, మేజర్ శ్రీనివాసరావు, వసంతరావు, నాగిరెడ్డి, పోతురాజురెడ్డి, తండవయ్య, కోకి ధర్మారెడ్డి తదితర మాజీ సైనికులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో శేషగిరిరావు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం : ఎంపీడీవో

వేమూరు, మార్చి 2 : పోలియో రహిత సమాజాన్ని నిర్మించుకునేందుకు తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని ఎంపీడీవో జి.ఎస్.వి.శేషగిరిరావు పిలుపునిచ్చారు. వేమూరులో మండల వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట సురేష్‌బాబు అధ్యక్షతన శనివారం ర్యాలీ నిర్వహించారు. మండల గ్రామాల్లో ఆది, సోమ, మంగళవారాలలో జరిగే పోలియో చుక్కల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ 14 సచివాలయాల పరిధిలో 22 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొంటారు. మొబైల్ వ్యాన్ ద్వారా షావలి దళితవాడ, బేతాళపురంలలో పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో 2200 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. ర్యాలీలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్య అన్ని సామాజిక రుగ్మతలకు సరైన ఔషధం

నగరం, మార్చి 2 : నేటి సమాజంలో ప్రధానంగా బాలల హక్కుల అమలుకు విఘాతం కలిగిస్తున్న బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహ వ్యవస్థ, అలానే బాలలపై లైంగిక వేధింపులు, బాలల అక్రమ రవాణా లాంటి అపరిష్కృత సమస్యలు అన్నింటిని రూపుమాపడానికి సమాజాన్ని విద్యావంతం చేయడం ద్వారా జాగృతం చేయడం ఒక్కటే మార్గమని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు చింతల శ్రీకృష్ణయ్య అన్నారు. నగరం మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శనివారం జరిగిన మండల స్థాయి స్టేక్ హోల్డర్స్ మీటింగ్‌కు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. 14 సంవత్సరాల లోపు బాలలందరూ విధిగా బడులలోనే ఉండాలని, పొరపాటున కూడా షాపులలోను, ఇతర వ్యాపార సంస్థలలోను ఉండరాదని, ఎవరైనా బాలలను పనులలోకి తీసుకున్నట్లయితే వారిపై బాల కార్మిక నిర్మూలన చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్ రమాదేవి మాట్లాడుతూ బాలల సమస్యలపై స్పందించటం, సమస్యలను రూపుమాపడానికి నిర్మాణాత్మక ప్రణాళిక ద్వారా ప్రయత్నం చేయడం డీఆర్‌డీఏ లక్ష్యాల్లో ఒకటని అన్నారు. ఈ సమావేశంలో నగరం మండల అభివృద్ధి అధికారి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు డీఆర్‌డీఏ ఏపీఎం, డ్వాక్రా సంఘాల యానిమేటర్లు, సిపార్డు స్వచ్ఛంద సేవా సంస్థ యాక్సిస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ నగరం మండల కోఆర్డినేటర్ కోమరగిరి నాగేశ్వరరావు, ఇతర కోఆర్డినేటర్లు బేతపూడి నాగేంద్రరావు, పెట్ల మరియజ్యోతి, సరిత, సిపార్డు స్వచ్ఛంద సేవా సంస్థ యాక్సెస్ టు జస్టిస్ ఫర్ చిల్డ్రన్ జిల్లా కో ఆర్డినేటర్ ప్రభాకరరావు పాల్గొన్నారు.

6న గూడవల్లి ఐటీఐ కళాశాలలో జాబ్ మేళా

చెరుకుపల్లి, మార్చి 2 : మండలంలోని గూడవల్లి ఐటీఐ కళాశాలలో ఈనెల 6న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రావి శ్యామ్ ప్రసాద్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాకు కాంటినెంటల్ కాపిలిమిటెడ్, ఎస్ఎస్ఎస్ టెక్స్‌టైల్స్, ఫక్స్ టెక్ సొల్యూషన్స్, హెట్రా డ్రగ్స్, ఆదిత్యబిర్లా, పలు సంస్థలు పాల్గొంటాయన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగించుకోవాలని కోరారు.

సోలార్ సిస్టం అందరూ సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె, మార్చి 2 : దేశవ్యాప్తంగా సోలార్‌రూఫ్ టాప్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తపాలా శాఖ రేపల్లె సబ్ డివిజన్ పోస్టల్ అధికారి కె.ఏడుకొండలు అన్నారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో గల అన్ని పోస్టాఫీసుల్లో రూ.300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ డిజిలి యోజనా పథకం రిజిస్ట్రేషన్లను ప్రారంభించామని తెలిపారు. వివరాలకు సమీప పోస్టాఫీసులో సంప్రదించాలని కోరారు.

మార్కెట్ యార్డు భవనానికి శంకుస్థాపన

రేపల్లె, మార్చి 2 : రైతులకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో శనివారం నూతన భవనానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మార్కెట్ యార్డు పాలన భవనానికి రూ.కోటి నిధులు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో అధునాతనమైన అన్ని సౌకర్యాలు ఉన్న నూతన భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దేవినేని మల్లికార్జునరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ దేవగిరి సాంబశివరావు, సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, మాజీ ఎమ్మెల్యే దేవినేని

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం

కర్లపాలెం, మార్చి 2 : కర్లపాలెం గౌడపాలేనికి చెందిన కాటూరి వెంకటేశ్వర్లు ఇల్లు ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదానికి గురైంది. ఈ విషయం తెలుసుకున్న బాపట్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ శనివారం బాధితులను పరామర్శించి వారికి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాతనందాయపాలెంలో...

కర్లపాలెం మండలం పాతనందాయపాలెం గ్రామానికి చెందిన కోకి వీరారెడ్డి, పిట్టు గోపాల్‌రెడ్డి రెండు ఇళ్ళు ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదానికి గురయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోన రఘుపతి శనివారం బాధితులైన ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు



కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను అందిస్తున్న టీడీపీ నాయకులు

సైకో పాలనను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలి

● ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్

రేపల్లె, మార్చి 2 : రాష్ట్రంలో సైకో ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధమవ్వాలని ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. నిజాంపట్నం మండలంలోని ప్రజ్ఞం పంచాయతీ చెక్కావారిపాలెం గ్రామాల్లో ఆదివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అరాచకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూరుతుందని, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు దోహదపడుతుందన్నారు. అధికార పార్టీ నాయకులు కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారని, ఎన్నికలు 52రోజులు మాత్రమే ఉండటంతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ఈవిషయాన్ని గమనించి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు ప్రజలు సైనికుల్లా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహన కార్యదర్శి వంతాని మురళీధరరావు, నల్లపాటి యల్లయ్య, కూచిపూడి మోహన్‌రావు, కొలసాని రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు గూడవల్లిలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ

చెరుకుపల్లి, మార్చి 2 : మండలంలోని గూడవల్లి గ్రామంలో ఆదివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ గ్రామాలలో చంద్రబాబు పాలనలో అందించే సంక్షేమ పథకాలను వివరించేందుకు బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మండవ తాతాజీ, వేము మోహన్‌బాబు, కందుల వెంకటేశ్వరరావు, పున్నారావు, గాదె సాంబశివరావు పాల్గొన్నారు.

ఆనందబాబు విజయాన్ని కాంక్షిస్తూ అజ్మీర్ దర్గాలో ప్రార్ధనలు



దర్గాలో ప్రత్యేక దువా చేయిస్తున్న హనీఫ్

వేమూరు, మార్చి 2 : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అత్యంత మెజార్టీతో విజయం సాధించాలని, వేమూరు నియోజకవర్గంలో నక్కా ఆనందబాబు అధిక మెజార్టీతో గెలవాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ మొహమ్మద్ హనీఫ్ అజ్మీర్ యాత్రకు వెళ్ళారు. రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్లో శుక్రవారం రాత్రి ఖవాజా గరిబుల్ నవాజ్ దర్గాలో కవాజా బాబాకి చాదర్, పుష్పాలతో ప్రత్యేక దువా చేయించారు. దర్గాలోని పెద్దలైన ఇమాములు చేత చంద్రబాబు నాయుడు, ఆనందబాబుల పేరున ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహింప చేశారు. ఖవాజా బాబాకి కప్పిన ప్రత్యేక శాలువాలను చంద్రబాబు, ఆనందబాబులకు సమర్పించేందుకు తీసుకువస్తున్నట్లు తెలిపారు.

శ్రీకృష్ణదేవరాయలకు టీడీపీ యువజన నాయకుడి మద్దతు

వేమూరు, మార్చి 2 : వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి చేరిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులను వేమూరు మండలం బూతుమల్లి గ్రామానికి చెందిన టీడీపీ తెలుగు యువత నాయకుడు తుమ్మల జితేంద్ర శనివారం కలుసుకున్నారు. చిలకలూరిపేట సమీపంలోని బోయపాలెం పార్వతి అమ్మవారి ఆలయం వద్ద కలుసుకుని తన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణదేవరాయులకు మిఠాయిలు తినిపించారు. తమ కళాశాలలో చదువుకుని రాజకీయాల్లో యువజన నాయకుడుగా అడుగుపెట్టి తనపై అభిమానంతో తనను కలుసుకున్నందుకు సాయికి శ్రీకృష్ణదేవరాయులు అభినందనలు తెలిపారు.

సమష్టి కృషితో ఎన్నికలు నిర్వహిద్దాం : ఆర్డీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హేలా షారాన్

రేపల్లె, మార్చి 2 : సమష్టి కృషితో ఎన్నికలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహిద్దామని ఆర్డీవో హేలా షారాన్ అన్నారు. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఏఆర్‌వోలు, ఏడీపీలు, ఎఫ్ఎస్‌టీ, ఏటి బృందాలతో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముందస్తుగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అప్పగించిన బాధ్యతలను నిర్లక్ష్యం చేయకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముంబై పారిశ్రామికవేత్తతో వరలక్ష్మి శరత్‌కుమార్ నిశ్చితార్థం



ప్రముఖ సినీ నటి వరలక్ష్మి శరత్‌కుమార్ ముంబైకు చెందిన పారిశ్రామికవేత్త నికోలయ్ సచ్‌దేవ్‌ను పెళ్ళి చేసుకోనున్నారు. వీరిద్దరి నిశ్చితార్థం శుక్రవారం ముంబై నగరంలో ఇరు కుటుంబాల సమక్షంలో జరిగింది. వివాహం ఈ ఏడాదిలోపు జరుగనుందని, త్వరలోనే వివాహ తేదీని వెల్లడిస్తామని వరలక్ష్మి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, వీరిద్దరూ 14 ఏళ్ళుగా స్నేహితులుగా కొనసాగుతున్నారు. ఎట్టకేలకు త్వరలోనే ఓ ఇంటివారు కాబోతున్నారు. ఈ నిశ్చితార్థంలో సినీ నటుడు శరత్ కుమార్, ఆయన సతీమణి రాధిక శరత్ కుమార్‌తో పాటు వరుడు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా, వరలక్ష్మి శరత్ కుమార్ ఇటు తెలుగు, అటు తమిళ చిత్రసీమల్లో మంచి గుర్తింపుతో పాటు వరుస అవకాశాలు దక్కించుకుంటూ సినీ కెరీర్‌ను కొనసాగిస్తున్న విషయం తెలిసిందే.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

విదేశాల్లోనూ హను-మాన్‌ను విడుదల చేస్తున్నాం



యువ కథానాయకుడు తేజ సజ్జా హీరోగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి నిర్మించిన 'హను-మాన్' చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలై విజయవంతంగా 50 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన వేడుకలో దర్శకుడు మాట్లాడుతూ '50 రోజుల పండగ చూసి చాలా రోజులైంది. అది మా సినిమాకు జరగడం ఆనందంగా ఉంది. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి రాబోయే చిత్రాలకు ఈ చిత్ర విజయం పునాది వేసింది. విదేశాల్లోనూ ఈ సినిమాను విడుదల చేస్తున్నాం. 'జై హనుమాన్' వర్క్ మొదలైంది. 'హను-మాన్'లో చివరి ఐదు నిముషాలు ఎలా అందరికీ నచ్చాయో 'జై హనుమాన్' కూడా అలాగే ఉండబోతోంది' అన్నారు. ప్రేక్షకుల వల్లే ఇంత అద్భుత విజయం సాధ్యమైందని హీరో తేజ చెప్పారు. 150 థియేటర్లలో 50 రోజులు ఆడడం సాధారణ విషయం కాదని, అందరూ అంకిత భావంతో పని చేయడం వల్లే ఇది సాధ్యమైందని నిర్మాత నిరంజన్‌రెడ్డి చెప్పారు.

మేం ఆశించిన హిట్ వచ్చింది



'సినిమా మొదలు పెట్టినప్పుడు బాగా వస్తే చాలు అనుకున్నాం. తర్వాత ప్రమోషనల్ మెటీరియల్ ప్రేక్షకులకు రీచ్ అయితే అదే పదివేలు అనుకున్నాం. అన్నింటికి మించి ఒక మంచి హిట్ కొడితే బావుంటుందనే కోరిక మనసులో ఉండేది. అది ఇప్పుడు తీరినందుకు ఆనందంగా ఉంది' అన్నారు శివ కందుకూరి. ఆయన హీరోగా నటించిన 'భూతద్దం భాస్కర్ నారాయణ' శుక్రవారం విడుదలై విజయం సాధించడంతో శనివారం సక్సెస్ మీట్ నిర్వహించారు. సినిమా చూసి ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారని శివ చెప్పారు. తాము ఊహించిన దానికంటే అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిందని హీరోయిన్ రాశీ సింగ్ తెలిపారు. నిర్మాతలు స్నేహాల్ శశిధర్ మాట్లాడుతూ 'ప్రతి షోకీ ఆదరణ పెరుగుతోంది. ఇంత మంచి విజయం అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు' అని చెప్పారు

మైనస్ 30 డిగ్రీల్లో షూటింగ్ చేశాం

విశ్వక్ సేన్



'ఈ సినిమా షూటింగ్ ప్రతి రోజూ సవాలే. మైనస్ 30 డిగ్రీల్లో వర్క్ చేశాం. కాళ్లు చేతులు గడ్డ కట్టేవి. ఇప్పుడు అది తలుచుకుంటే ఇంత రిస్క్ చేశామా అనిపిస్తుంది. ఇప్పుడు చేయమంటే మాత్రం చేయను' అన్నారు హీరో విశ్వక్ సేన్. ఆయన నటించిన 'గామి' చిత్రం ఈ నెల ఎనిమిదిన విడుదల కానుంది.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ' లుక్ విషయంలో చాలా కేర్ తీసుకున్నాం. అఘోరా పాత్ర కోసం దర్శకుడు విద్యాధర్ ఎంతో రిసెర్చ్ చేశారు. మూడేళ్ల ముందుగానే ప్రీ ప్రొడక్షన్ వర్క్ చేశారు. కుంభమేళాలో కొన్ని లక్షల మంది అఘోరాలు ఉంటారు. నేనూ వాళ్లతో కలసిపోయేవాడిని. నా స్టయిల్‌లో ఎక్స్‌ప్లోర్ చేసుకుంటూ వెళ్లా' అని ఆయన చెప్పారు.

దర్శకుడు విద్యాధర్ తను నటించిన 'వెళ్లిపోమాకే' సినిమా చూసి తన దగ్గరకు వచ్చాడని చెబుతూ 'ఈ కథను సినిమాగా మలచడానికి ఐదేళ్లు పడుతుందని నాకు ముందే తెలుసు. ఒక వేళ ఏడాదిలో తీయాలనుకుంటే రూ వంద కోట్లు కావాలి. వారణాసి, కుంభమేళలో గొరిల్లా షూటింగ్ చేశాం. అలా బడ్జెట్ కలసి వచ్చింది. సమయమే దీనికి పెట్టుబడి. ఇప్పటివరకూ ఎవరూ తీయని చిత్రమిది' అని విశ్వక్ సేన్ చెప్పారు. ఈ సినిమాకు తను పారితోషికం తీసుకోకుండా పని చేసినట్లు ఆయన చెప్పారు. మొత్తం 70 రోజులు పని చేసినట్లు తెలిపారు. హీరోయిన్ చాందిని కూడా చాలా కష్టపడిందని చెప్పారు. పీసీఎక్స్ ఫార్మెట్‌లో 'గామి' చిత్రాన్ని విడుదల చేస్తున్నామనీ, తెలుగులో ఈ ఫార్మెట్‌లో వస్తున్న తొలి చిత్రమని ఆయన తెలిపారు.

ప్రశాంతంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు

అద్దంకిటౌన్, మార్చి 2: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అద్దంకిలో నాలుగు కేంద్రాలలో పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరిగాయి. పట్టణంలోని శ్రీప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల, విశ్వభారతి, శ్రీచైతన్య సాధన గోవిందాంబిక పర్యమేశ్వరి జూనియర్ కళాశాలలో మొత్తం 858 మంది విద్యార్థులకు గాను 823 మంది హాజరయ్యారు. 35 మంది విద్యార్థులు గైర్హాజరయినట్టు అధికారులు తెలిపారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండయ్య

చీరాల, మార్చి 2: వచ్చే ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా సమిష్టి కృషి అవసరం.. అందుకు అనుగుణంగా ప్రణాళికబద్ధంగా అడుగులు వేద్దామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య పిలుపునిచ్చారు. ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ నటించిన సమరసింహారెడ్డి చలన చిత్రం రీ రిలీజ్ సందర్భంగా అభిమానులు స్థానిక సురేష్‌మహల్ థియేటర్లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఆ యన మాట్లాడుతూ సమిష్టి కృషితోనే సత్ఫలితాలు సాధ్యమన్న విషయాన్ని ప్ర తిఒక్కరూ గుర్తించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్‌రెడ్డి పాత్రపై విచారణ జరపాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎంఎం కొండయ్య డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ బాబాయ్ కేసులో అబ్బాయ్ పాత్రను బహిర్గతం చేస్తే అన్ని విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. తొలుత ఆ కేసును సీబీఐకి అప్పగించాలన్న జగన్ తరువాత వద్దనటంలో ఆంతర్యాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత జగన్‌పై ఉందన్నారు. ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకుంటున్నారన్నారు.

బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

చినగంజాం, మార్చి 2: రాష్ట్రంలో బీసీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మార్టూరు మండలం ఇసుకదర్శిలోని ఏలూరి క్యాంపు కార్యాలయంలో చినగంజాం మండల టీడీపీ బీసీ సంఘం అధ్యక్షుడు వాటుపల్లి ఏడుకొండలు అధ్యక్షతన పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లెపాలెం గ్రామానికి చెందిన వైసీపీ బీసీ నేతలు శనివారం టీడీపీలో చేరారు. పల్లెపాలెంకు చెందిన బీసీ నేతలు అవనిగడ్డ గోపి, కొక్కిలిగడ్డ గోవర్థన్, వీర్రాజు, నాగశ్రీను, కళ్యాణ్, సాంబశివరావు, కొత్తబాబు, సాయి, నాగరాజు, మురళీ, స్వాములు, శివ, కార్తీక్, గోపి, సురేష్, ప్రసాద్, గోపిరాజు, శ్రీనులకు ఎమ్మెల్యే ఏలూరి పార్టీ కండవాలు కప్పి ఆహ్వానించారు. కాటంవారిపాలెం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నేతలు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రుద్రమాంబపురంకు చెందిన టీడీపీ నేతలు ఎమ్మెల్యే ఏలూరిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పొద వీరయ్య నియోజకవర్గ బీసీ సంఘం ఉపాధ్యక్షుడు దండుప్రోలు తిరుపతిరావు, సీనియర్ నాయకులు గొల్లపోతు వెంకటేశ్వర్లు, కొక్కిలిగడ్డ రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న కరణం వెంకటేష్

వేటపాలెం(చీరాల), మార్చి 2: ప్రాధాన్యతాక్రమంలో సమస్యలను పరిష్కరించేందుకు ప్రణాళికబద్ధంగా పనిచేస్తున్నట్టు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్ అన్నారు. వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా లబ్ధిదారులతో శనివారం వెంకటేష్ మాటాడారు. ఇంకా ఏమన్నా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరిస్తామన్నారు. ఎప్పుడు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం జాయింట్ సెక్రటరీ మల్లెల లలితరాజశేఖర్, బొడ్డు సుబ్బారావు, లేళ్ల శ్రీధర్, ఏవో కాశీవిశ్వనాథ్, ఏపీఎం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

'వ్యాపారస్తులకు అండగా ఉంటాం'

మార్టూరు, మార్చి 2: వ్యాపారస్తులు తమ వ్యాపారాలను స్వేచ్ఛగా చేసుకునే విధంగా అవకాశాలు కల్పిస్తామని టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు భరోసా ఇచ్చారు. శనివారం సాయంత్రం మండలంలోని ఇసుకదర్శిలోని ఏలూరి క్యాంపు కార్యాలయంలో పర్చూరు నియోజకవర్గం వాణిజ్య విభాగం ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏలూరి మాట్లాడుతూ వ్యాపారస్తులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామన్నారు. వారి ఉన్నతికి తప్పనిసరిగా సహాయ సహకారాలను అందిస్తామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో అన్ని రంగాలలో వ్యాపారాలు దెబ్బతిన్నాయన్నారు. వేల మందికి ఉపాధి కల్పించే పరిశ్రమలు రాష్ట్రం దాటి వెళ్లి పోయాయన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత చిన్న స్థాయి నుండి కోట్ల రూపాయల వ్యయంతో నిర్వహించే వ్యాపార రంగాలకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. వైసీపీ పాలనలో అన్ని రకాలుగా వ్యాపారులపై బెదిరింపులు, దౌర్జన్యాలు పెరిగాయన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, కొత్తగా పరిశ్రమలు రావాలన్నా, సామాన్య, మధ్యతరగతి, చిరు వ్యాపారులు సంతోషంగా జీవించాలన్నా మరలా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు.

కార్యక్రమంలో వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పాలేరు రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడిపాక హరిప్రసాద్ , కన్నెగంటి శ్రీనివాసరావు, గుర్రం శ్రీను, మోటుమర్రి రామసుబ్బారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి..

- సొంత చెల్లికే న్యాయం చేయలేని జగన్ ముఖ్యమంత్రి పదవికి అనర్హుడు
- ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్



చెన్నుపల్లి గ్రామ నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

బల్లికురవ, మార్చి 2: సభలు, సమావేశాలలో అక్క చెల్లెమ్మలు అంటే ఎంతో ప్రేమ చూపించే జగన్ తన సొంత చెల్లెల్లు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము లేదని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శనివారం సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం అడ్డరోడ్డులో గల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బల్లికురవ మండలం కొప్పెరపాలెం, ఉప్పుమాగులూరు. వేమవరం, రాజుపాలెం, కొణిదె, గంగపాలెం, పాతమల్లాయపాలెం, బల్లికురవ, కొండాయపాలెం, గుంటుపల్లి, చెన్నుపల్లి, నక్కబొక్కల పాడు గ్రామాల టీడీపీ నేతలు, బూత్ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ గత ఎన్నికల్లో వచ్చిన మెజారిటీ కంటే అత్యధికంగా మెజారిటీ వచ్చేలా నేతలు, కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలన్నారు. చంద్రబాబు నాయుడు నిరుపేదలందరికీ లబ్ధి చేకూరేలా ప్రవేశ పెడుతున్న సూపర్ సిక్స్ గురించి ప్రజలకు వివరించాలన్నారు. అలాగే, రాబోయే నలభై రోజులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను గమనించి టీడీపీ విజయానికి కృషి చేయాలన్నారు.

అనంతరం గ్రామాలవారీగా గత ఎన్నికల్లో బూత్‌ల వారీగా వచ్చిన ఓట్లు వివరాలపై చర్చించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలపై వారిని అడిగి తెలుసుకొన్నారు. తదనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. రోజురోజుకు పెరుగుతున్న వ్యతిరేకతతో వైసీపీ ఖాళీ అవుతుందన్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు టీడీపీలోకి వచ్చేందుకు క్యూ కడుతున్నారన్నారు. సొంత చెల్లెల్లు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు కూడా జగన్‌రెడ్డి భయపడుతున్నారని పేర్కొన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు సీబీఐకి అప్పగించాలని గతంలో కోరిన జగన్ ఇప్పుడు ఈ కేసు గురించి అసలు పట్టించుకోవటం లేదన్నారు. తన సొంత బాబాయ్ హత్య జరిగి అయిదేళ్లయినా కేసును చేదించలేని ముఖ్యమంత్రి జగన్ అసమర్థులని అన్నారు. శవ రాజకీయాలను ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు. పేదలు, పెత్తందార్లు అంటు ప్రగల్భాలు పలికే ముఖ్యమంత్రికి తన సొంత చెల్లికి న్యాయం చేసే మనస్సు లేదన్నారు. హంతకులకు కొమ్ము కాస్తున్నారని, అందుకే పదే పదే ఢిల్లీ వెళ్లి కేసుల నుండి బయటపడాలని పైరవీలు చేస్తున్నారని విమర్శించారు. అరాచక ప్రభుత్వం ఇంటికి పోవాలంటే సునీతారెడ్డి చెప్పిన విధంగా జగన్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలని రవికుమార్ పేర్కొన్నారు.

సమావేశంలో గ్రామాల నేతలు మలినేని గోవిందరావు, కొండేటి ఇజ్రాయల్, గొట్టిపాటి శంకర్, ఆళ్ల చంద్రమౌళి, అమరనేని కాశీవిశ్వనాథం, గొట్టిపాటి లక్ష్మయ్య, పావులూరి ఏడుకొండలు, పుచ్చకాయల సుబ్బరామయ్య జాష్టి శ్రీరంగనాయకులు, చెరుకూరి అంజనేయులు, దూళిపాళ్ల హనుమంతరావు, వేల్పూరి దానయ్య, గొట్టిపాటి మారుతి, కోట శ్రీనివాసరావు, గుంజి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్ర పునర్నిర్మాణం

- భావితరాల భవిష్యత్ చంద్రబాబుపైనే
- వివేకా హత్యకేసులో జగన్‌రెడ్డి పాత్రపై విచారణ జరగాలి
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



టీడీపీలో చేరిన యువతతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, మార్చి 2 తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్ర పునర్నిర్మాణం సాధ్య మని, బావితరాల భవిష్యత్ చంద్రబాబుతోనే ముడిపడి ఉందని ఆపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శనివారం మార్టూరు మండలం ఇసుకదర్శిలోని క్యాంపు కార్యాలయంలో ప ర్చూరు నియోజకవర్గంలోని పలుగ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఏలూరి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా ఏలూరి మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్ర అన్నిరంగాల్లో వెనుకబాటుకు గుర యిందన్నారు. అభివృద్ధిలో పరుగులు తీయాల్సిన రాష్ట్రం అచేతన స్థితిలో ఉందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అ గ్రభాగంలో ఉంటే, నేడు అధమ స్థితిలో ఉండటం విచారకరమన్నారు. రా ష్ట్రం తిరిగి గాడిన పడాలంటే విజినరీ అనుభవం ఉన్న చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో గత నాలుగున్నరేళ్ళుగా అరాచకం, విధ్వసం, దోపిడీ తప్ప అభివృద్ధి లేదన్నారు.

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్‌మోహన్‌రెడ్డి పాత్రపై విచారణ జరపాలని ఎమ్మెల్యే ఏలూరి డిమాండ్ చేశారు. రాజకీయ లబ్ధికోసం వివేకానందరెడ్డిని జగన్ మురానే హతమార్చిందని ఆరోపించారు. మొదటి సీబీఐ విచారణ కోరిన జగన్ రెడ్డి ఆతరువాత వద్దు అనటం వెనుక ఉన్న కారణాన్ని రాష్ట్ర ప్రజలకు వివచరించాలన్నారు. తన తండ్రికి న్యాయం చేయాలని కూతురు పోరాడుతుంటే తమ్ముడిని సీబీఐ అరెస్టు చేయకుండా జగన్ అడ్డుపడుతున్నారన్నారు.

పర్చూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో తెలుగుదేశం పార్టీలోకి వలసలపర్వం ఊపందుకుంది. చిన్నగంజాం మండలం పెద్దగంజాం పల్లెపాలంకు చెందిన 30 మంది యువకులు ఆసోది సుబ్బారెడ్డి, గొల్లపోతు వెంకటేశ్వర్లు, దండుప్రోలు తిరుపతిరావు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కఠారివారిపాలెంకు చెందిన యువకులు, ఇంకొల్లు మండలం నాగండ్లకు చెందిన యువకులు, మార్టూరు చెందిన యువకులు ఏలూరి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈసందర్భంగా ఏలూరి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కలసి పనిచేసి పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.

దారిని మూసివేయించిన వైసీపీ సర్పంచ్

- ఇబ్బందులు పడుతున్న నాలుగు కుటుంబాలు



ద్రోణాదుల బీసీ కాలనీలో రోడ్డుకు అడ్డుగా కర్రలు, ముళ్ల చెట్లుతో దారిని మూసి వేయించిన వైసీపీ సర్పంచ్ భాగ్యారావు

మార్టూరు, మార్చి 2: నాలుగు కుటుంబాలు ఇంటి నుంచి బజారుకు వెళ్లడానికి వీల్లేకుండా వైసీపీ సర్పంచ్ దారిని మూసివేయించారు. శనివారం మండలంలోని ద్రోణాదుల గ్రామంలోని బీసీ కాలనీలో ఈ సంఘటన జరిగింది. సర్పంచ్ వంకాయలపాటి భాగ్యారావు పంచాయతీ సిబ్బందితో మెట్టిల గంగయ్య, మెట్టిల వెంకట్రావు, అయినంపూడి వెంకటేశ్వర్లు, షేక్ చిన్న అంజమ్మల నివాసగృహాల నుంచి కుటుంబ సభ్యులు రోడ్డుపై నడవడానికి వీల్లేకుండా దారిని కర్రలతో, ముళ్లచెట్లతో మూసి వేయించారు.

ద్రోణాదుల బీసీ కాలనీలో దాదాపుగా 30కు పైగా నివాస గృహాలు ఉన్నాయి. ఈ కాలనీలో నాలుగు కుటుంబాల నివాస గృహాలు చివరన ఉన్నాయి. వారిలో వెంకటేశ్వర్లు, చిన్న అంజమ్మకు చెందిన పశువుల కొష్టాలు కూడా ఉన్నాయి. కాలనీలోని మురుగునీరు బయటకు వెళ్లేందుకు వారి ఇళ్ల వరకు సైడు కాల్వలు నిర్మించడానికి సర్పంచ్ ప్రయత్నం చేశారు. అయితే, ఎగువన ఉన్న నివాస గృహాల నుండి మురుగు నీరు తమ ఇళ్లవరకు వచ్చి సైడు కాల్వల్లో నిలిచి పోతాయని వారు పేర్కొన్నారు. తద్వారా తమకు ఇబ్బందిగా ఉంటుందని సైడు కాల్వ నిర్మాణానికి నాలుగు కుటుంబాలు నిరాకరించాయి. తమ స్థలాలను దాటి పక్కనే ఉన్న పంట పొలాల వరకు సైడు కాల్వను పొడిగిస్తే తనకు అభ్యంతరం లేదని చెప్పారు. అయితే, పొలం వరకు సైడు కాల్వల నిర్మాణానికి పొలం యజమాని అంగీకరించలేదు. కాలనీలోని మురుగునీరు అంతా తన పొలంలోకి వస్తే పంటకు నష్టం జరుగుతుందని, ఈ మురుగునీరును రాజుగారిపాలెం రోడ్డుకు మరలించే ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పంచాయతీ చేసుకోవాలని తన అభిప్రాయాన్ని తెలిపాడు. గత కొంతకాలంగా ఈ వివాదం సర్పంచ్‌కు, ఈ కుటుంబాల మధ్య జరుగుతున్నది. ఈక్రమంలో నాలుగు కుటుంబాలు రోడ్డు గుండా రావడానికి అవకాశం లేకుండా దారికి అడ్డుగా ముళ్లకంపను కర్రలతో కట్టించేశాడు. శనివారం సాయంత్రం స్కూల్ నుండి ఇంటికి వచ్చిన పిల్లలు ముళ్లకంప కారణంగా ఇంట్లోకి రాలేకపోయారు. పశువుల కొష్టాలకు గేదెలను కూడా తీసుకుపోలేని పరిస్థితి ఏర్పడిందని అంజమ్మ అనే మహిళ వాపోయారు.



ముళ్ల కంచెకు ఒకవైపు పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన పిల్లలు, మరోవైపు తల్లిదండ్రులు

ఈ విష యమై సర్పంచ్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా వారికి తాము వేసిన రోడ్డుపై నడిచే అర్హత లేదన్నారు. సైడు కాల్వ తీయడానికి వారు అంగీకరిం చలేదన్నారు. ఈఘటనను ఎంపీడీవో నితిన్ దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా స్పందించారు. ఈవోఆర్‌డీని సంఘటనా స్థలానికి పంపించి దారికి అడ్డుగా వేసిన కర్రలను, ముళ్ల చెట్లను తొలగించేలా చర్యలు చేపడతామన్నారు. రాత్రి 8 గంటల వరకు రోడ్డుకు అడ్డుగా వేసిన ముళ్ల చెట్లను తొలగించలేదు.

భక్తిభావంతో తిరునాళ్లను నిర్వహించాలి



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

చినగంజాం, మార్చి 2: భక్తిభావంతో తిరునాళ్లను జరుపుకుంటూ, అశ్లీల నృత్యాలకు తావులేకుండా కార్యక్రమాలను నిర్వహించాలని చీరాల డీఎస్పీ బేతపూడి ప్రసాద్ అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో ఈనెల 8న జరగనున్న మహాశివరాత్రి తిరునాళ్ళను పురస్కరించుకుని బాలకోటేశ్వర, రామకోటేశ్వరస్వామి ఆలయాల కమిటి సభ్యులతో శనివారం ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో తిరునాళ్లను జరుపుకోవాలని డీఎస్పీ సూచించారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా స్టాల్స్ ఏర్పాటుచేసుకోవాలని చెప్పారు. రెండు ఆలయాల కమిటీ సభ్యులు అన్నదమ్ములుగా కలిసి తిరునాళ్లను నిర్వహించుకోవాలని, పోలీసు సహకారం అందిస్తామని చెప్పారు. తిరునాళ్లలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాలను వేకువజామున 3గంటల వరకు జరుపుకునేలా అనుమతి ఇవ్వాలని ఆలయాల కమిటీ సభ్యులు డీఎస్పీని కోరారు. ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమయం పొడిగించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయాల వద్ద ఉదయం నుంచి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు కోరారు. కార్యక్రమంలో ఇంకొల్లు సీఐ శ్రీనివాసరావు బాలకోటేశ్వర, రామకోటేశ్వర స్వామి, ఆలయాల కమిటీ చైర్మన్‌లు రామిరెడ్డి, టీఎస్ఆర్ ఆంజనేయులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా అతిథి గృహం

చీరాల, మార్చి 2: మండలంలోని వాడరేవు సముద్రతీరంలో నిర్మించిన ప్రభుత్వ అతిథి గృహం నిరుపయోగంగా మారింది. సుమారు దశాబ్దం క్రితం రూ.17 లక్షల వ్యయంతో వాడరేవు సముద్రం తీరంలో ఈ అతిథి గృహం నిర్మాణం చేశారు. ఇప్పటికీ ఆ అతిథి గృహం ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో అది శిథిలావస్థకు చేరింది. అతిథి గృహం కింద భాగంగా మత్స్యకారులు వలలు మరమ్మతులు చేసుకునేందుకు, మందుబాబులకు అడ్డాగా మారింది. వాడరేవు తీరానికి వచ్చే పర్యాటకుల విడిదికి ప్రయివేటు రిసార్ట్‌లు, హోటళ్లు భారీగా డబ్బు వసూలు చేస్తున్నాయి. ఈక్రమంలో ప్రభుత్వ అతిథి గృహం వినియోగంలో ఉంటే కొంతమేర ఉపశమనంగా ఉంటుందని భావిస్తున్నారు.

ఈనేపథ్యంలో నిరుపయోగంగా, శిథిలావస్థకు చేరిన ఆ అతిథి గృహానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పర్యాటకులతో పాటు స్థానికులు కోరుతున్నారు.



నిరుపయోగంగా అతిథి గృహం

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి



జాండ్రపేట శివారు కాలనీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బలరాం

వేటపాలెం(చీరాల), మార్చి 2: ప్రజలకు మెరుగైన సేవలు అందించటమే లక్ష్యంగా పాలకులు, అధికారులు పనిచేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మిస్తున్న సచివాలయం-1 పనులను స్థానిక నాయకులు, అధికారులతో కలసి శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం చీరాల మండలం జాండ్రపేట పంచాయతీ పరిధిలో మరమ్మతులకు గురైన రోడ్లను పరిశీలించారు. వాటికి మరమ్మతులు చేయించాలని అధికారులకు సూచించారు. అనంతరం శివారు కాలనీని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలసుకున్నారు. కుందేరు వెంట జీవనం సాగిస్తున్నవారికి మెరుగైన వసతి, సౌకర్యాల కల్పనపై అధికారులతో మాట్లాడారు. తదనంతరం రామకృష్ణాపురం పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో పీఆర్ డీఈ శేషయ్య, ఆసాది అంకాలరెడ్డి, పృథ్వి ధనుంజయ, లేళ్ల శ్రీధర్, బొడ్డు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఈపూరుపాలెం(చీరాలటౌన్), మార్చి 2: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని చీరాల రూరల్ సీఐ సత్యనారాయణ, ఎస్సై శివకుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని ఈపూరుపాలెం సమీపంలోని 216 జాతీయ రహదారిలో నో యాక్సిడెంట్ డే నిర్వహించారు. ఈసందర్భంగా పలు వాహనాలు తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు చలానాలు విధించారు. అలాగే , డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. ట్రాఫిక్ రూల్స్‌పై వాహనదారులకు అవగాహన కల్పించారు.

పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ

ఇంకొల్లు, మార్చి 1: మండలంలోని గంగవరం గ్రామంలో శ్రీవలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాల విద్యార్థులతో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నార్నె సమత, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కరి కమలేశ్వరరావు, ఆశా వర్కర్లు వలేరు సుజాత, కవలా జయమ్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశానికి తరలివెళ్లిన టీడీపీ నేతలు

చినగంజాం, మార్చి 2: మార్టూరు మండలం ఇసుకదర్శిలోని ఏలూరి క్యాంప్ కార్యాలయంలో శనివారం జరిగిన వాణిజ్య విభాగం ఆత్మీయ సమావేశానికి మండల పరిధిలోని ఆర్యవైశ్య నాయకులు, వాణిజ్య విభాగం నాయకులు తరలి వెళ్లారు. కడవకుదురు గ్రామంలోని ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఇసుకదర్శి వెళ్లారు. టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆధ్వర్యంలో నిర్వహించే వాణిజ్య విభాగం ఆత్మీయ సమావేశంలో తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లనున్నట్లు ఆర్యవైశ్య నాయకులు తెలిపారు. టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు మోటుమర్రి రామసుబ్బారావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోట శివరామకృష్ణ, నాయకులు బెల్లంకొండ రమేష్‌బాబు, శనగపల్లి సుబ్రమణ్యం, కందేపి సతీష్, పొట్టి రమేష్‌బాబు, బయ్యా సతీష్, చినగంజాం సర్పంచ్ రాయని ఆత్మారావు, తదితరులు ఆత్మీయ సమావేశానికి తరలివెళ్లారు.

దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు పెన్షను ఇవ్వాలి

మార్టూరు, మార్చి 2: దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు పెన్షను ఇవ్వాలని, గృహ నిర్మాణం కోసం నిధులను రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని దివ్యాంగుల కమిటి సమావేశంలో తీర్మానం చేశారు. మార్టూరులో విశ్రాంత ఉద్యోగుల భవనంలో శనివారం మండలంలోని దివ్యాంగుల కమిటీ సభ్యులు సమావేశమై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడిగా మహ్మద్ బాషా, మండల అధ్యక్షుడిగా ఉప్పలపాటి అచ్చుత రామరాజు, కార్యదర్శిగా గడ్డం జాన్, కోశాధికారిగా ఆవుల రత్తయ్య, సభ్యులుగా మీరావలి, కోట వెంకట సుబ్బారావు, కొమెర శ్రీనివాసరావు, వేళ్ల వసుందర ఎంపికయ్యారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మార్టూరు, మార్చి 2: మార్టూరులోని సుగాలి కాలనీకి సమీపంలో గోశాలకు వెళ్లే రహదారిలో నేల బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని శనివారం మార్టూరు పోలీసులు బయటకు తీశారు. స్థానిక బలరాం కాలనీకి చెందిన అంజయ్య అనే వ్యక్తికి చెందిన పొలంలోని నేల బావిలో మృతదేహాన్ని మేకల కాపరులు ఉదయం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని బయటకు తీయించారు. నెలరోజుల క్రితం అతను బావిలో పడి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. వీఆర్‌వో సమక్షంలో శవ పంచనామా చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్టు ఏఎస్ఐ బాషా తెలిపారు.

విద్యార్థినులు కష్టపడి ఉన్నతస్థాయికి చేరుకోవాలి

అద్దంకిటౌన్, మార్చి 2: విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంఈవో-2 బి. సుధాకరరావు అన్నారు. శనివారం శ్రీప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలలో పదో తరగతి విద్యార్థినులకు విడ్కోలు సభ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సుధాకరరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో కేఆర్‌కే విద్యార్థుల ఎంపిక

అద్దంకిటౌన్, మార్చి 2: ఒంగోలులోని ప్రభుత్వ మహిళ కళాశాలలో ఫిబ్రవరి 27న జరిగిన మెగా జాబ్ మేళాలో అద్దంకిలోని కేఆర్‌కే ప్రభుత్వ డి గ్రీ కళాశాలకు చెందిన 15 మంది విద్యార్థులు ఎంపికయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.మోహనరావు తెలిపారు. మొత్తం 46 మంది విద్యార్థులు జాబ్‌మేళాలో పాల్గొనగా వివిధ కంపెనీలకు 15 మంది ఎంపికయ్యారు. శనివారం ఎంపికైన విద్యార్థుల వివరాలు రాగా, ఆయా విభాగాల విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు జేకేసీ కోఆర్డినేటర్ ఎస్.షర్మిలారాణి, ఏ.శి ఖామణి, షేక్ మస్తాన్‌వలి, అధ్యాపకులు అశోక్, గంగయ్య, రమేష్ తదితరులు పాల్గొని అభినందించారు.

ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

వేటపాలెం(చీరాల), మార్చి 2: ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ప్రతి శనివారం నో యాక్సిడెంట్ డేలో భాగంగా ప్రత్యేక కార్యాచరణతో పోలీస్‌లు పనిచేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు. విధుల్లో ఉన్నపుడు వాహన చోదకులు పూర్తిస్థాయిలో ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి చెప్పారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

చీరాలటౌన్, మార్చి 2: చీరాల అసెంబ్లీ టికెట్ అన్ని రాజకీయ పార్టీలు బీసీలకే కేటాయించాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సామాజిక స్పృహ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో అధికశాతం మంది బీసీలు ఉన్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, దళిత క్రైస్తవులు, ముస్లిం మైనార్టీలకు ప్రాధాన్యం కల్పించాలని కోరారు. చట్ట సభల్లో వారికి సమన్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఐక్యమత్యంతో పోరాడి అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బీరక సురేంద్ర, అవ్వారు ముసలయ్య దామర్ల శ్రీకృష్ణ, మాచర్ల మోహన్‌రావు, గోసాల ఆశీర్వాదం, జూలియన్, చుండూరి వాసు, ఊటుకూరి వెంకటేశ్వర్లు, దార్ల శాస్త్రి, బాబురావు, గుమ్మడి ఏసురత్నం, మోహన్‌కుమార్‌ధర్మ, మొగిలి కార్తీక్, జిలానీ, రవి, బుల్లిబాబు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

మార్టూరు, మార్చి 2: మండలంలోని ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో స్థానిక నేతాజీ నగర్‌కు చెందిన అద్దేటి అనిల్ కుమార్, నాగండ్ల తిరుమల పార్టీలో చేరారు. వారికి ఏలూరి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో కన్నెగంటి శ్రీనివాసరావు, కామినేని జనార్దన్, షేక్ ఫరూక్, పోలూరి సింగయ్య, జాష్టి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. యద్దనపూడి మండలం పూనూరు ఎస్సీ కాలనీకి చెందిన వంకాయలపాటి రాజేష్, గుంటి అశోక్ టీడీపీలో చేరారు.

రోడ్డు ప్రమాదంలో బైకిస్టుకి తీవ్రగాయాలు

మార్టూరు, మార్చి 2: మార్టూరు సెంటర్లో పెట్రోలు బంకు ఎదురుగా జాతీయ రహదారిపై శనివారం మధ్యాహ్నం ద్విచక్రవాహనాన్ని టాటా ఏసీ వాహనం ఢీకొట్టడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన గుంజి గంగ రాజు ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పనుల నిమిత్తం మార్టూరు వచ్చి తిరిగి వెళుతున్నాడు. ఈక్రమంలో వెనుక నుండి వాహనం ఢీకొట్టడంతో గంగరాజు కాలికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 వాహనంలో నరసరావుపేటలోని ప్రయివేటు ఆస్పత్రి కి తరలించారు.